
వార్త
ఆదివారం
24 మార్చి, 2024
బాబోయ్!
ఎండలు..

తారాతీరం

# 'విశ్వంభర'లో త్రిష ద్విపాత్రాభినయం?



చిరంజీవి కథానాయకుడిగా 'విశ్వంభర' సినిమా రూపొందుతోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇందులో చిరంజీవి దొరబాబు అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. కథానాయిక పాత్రలో త్రిషను తీసుకున్నారు. అయితే ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుందని తాజా సమాచారం. ఈ సినిమాలో త్రిష భూలోకానికి చెందిన సాధారణమైన కన్యగా, దేవలోకానికి చెందిన దేవకన్యగా రెండు పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి, త్రిష ఈ ఇద్దరి పాత్రలు ఇటు క్లాస్, అటు మాస్‌గానూ కనిపిస్తాయని అంటున్నారు. కీరవాణి సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమాలో ఇతర దేవకన్యలుగా మరికొందరు కథానాయికలు కనిపించనున్నారు. వచ్చే సంక్రాంతి కానుకగా విడుదల కాబోతుంది సినిమా.

# ప్రభాస్ జోడీగా మృణాల్ ఠాకూర్!

'సీతారామం' చిత్రంతో నటనపరంగా మంచి మార్కులు కొట్టేసింది మృణాల్ ఠాకూర్. టాలీవుడ్‌లో తొలి సినిమాతోనే భారీ విజయం అందుకుంది. 'హాయ్ నాన్న' సినిమాతోను ప్రేక్షకులను ఆకట్టుకున్న మృణాల్ విజయ్ దేవరకొండతో జోడీగా త్వరలో 'ఫ్యామిలీ స్టార్'తో పలకరించనుంది. ప్రభాస్ సరసన నాయికగా ఆమె అవకాశం లభించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ నుంచి నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి', మారుతీ డైరెక్షన్‌లో 'రాజా సాబ్' ప్రేక్షకులను పలకరించనున్నాయి. ఈ రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ తన తరువాతి హను రాఘవపూడి దర్శకత్వంలో చేయనున్నాడు. 'సీతారామం' చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులే ఈ సినిమాకు పని చేయనున్నారట. కథానాయికగా మృణాల్ ఠాకూర్ ఎంపిక జరిగినట్లు తాజా సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.



ఆదివారం వార్త
24 మార్చి, 2024

## మంచి ముత్యాలు

రోగి ఉన్న గది భక్తిశ్రద్ధలు నిండిన ప్రార్థనాలయం.

- హెలెన్ కెల్లర్

## విషయ విశేషం


విజయ కెరటాలు... 4

'సంఘీ'భావం....5

గాడి తప్పిన సోషల్ మీడియా

కవర్ స్టోరీ..6

బాబోయ్!
ఎండలు..

పోషకాల నిధి కర్బూజా..10

ఈవారం కవిత్వం..12

ఏది మన ప్రస్థానం?

పవిత్ర మదీనా, మక్కాను దర్శిద్దాం..14

అక్షరాల్లో యాపిల్ పాడ్‌కాస్ట్‌లు...18

కథ.. 20

నాణేనికి మరోపక్క

సాహిత్యం..24

ప్రజ్ఞానిధి 'వేటూరి ప్రభాకర శాస్త్రి'

అరుదైన పర్వతాలు..26

..వాయిదా పడుతోంది...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### చెక్కతో ఉపగ్రహం



అంతరిక్షంలో ఉండే కఠిన పరిస్థితులను తట్టుకునేలా ఉపగ్రహాలను స్టీలు, టైటానియం, అల్యూమినియం, ప్లాస్టిక్ తదితరాలతో ప్రత్యేకమైన మెకానిజంతో రూపొందిస్తారు. జపాన్ మాత్రం అందుకు భిన్నంగా పర్యావరణహితంగా చెక్కతో ఉపగ్రహాలను రూపొందించి, ప్రయోగించే దేశంగా గుర్తింపునూ సొంతం చేసుకోనుంది. ఉపగ్రహం తయారీలో వాడే లోహాలు ఓజోన్‌పొరను దెబ్బతీస్తాయనే ఉద్దేశంతో క్యోటో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని చేశారు. అందుకోసం చంపక వృక్షాన్ని ఎంపిక చేసుకున్నారు. ఎలాంటి వాతావరణం లోనైనా పగుళ్లు రాకుండా దృఢంగా ఉంటుందని ఆ చెట్టు కలపను ఎంపిక చేసుకున్న శాస్త్రవేత్తలు..దానిపై ఎన్నో పరిశోధనలు చేశారు. ఆ కలపతో తయారు చేసిన శాటిలైట్‌ను త్వరలోనే అంతరిక్షంలోకి పంపి ప్రయోగాలు చేయనున్నారు.






మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# విజయ కెరటాలు

ఈ.ఎస్.మాధవన్

ఇంద్రనూయి కన్నా ముందు అంటే 1999లోనే రోహ్మా అండ్ హౌస్ అనే ప్రముఖ రసాయనాల ఉత్పత్తి సంస్థకి రాజ్‌గుప్త సి.ఇ.ఓగా పనిచేశారు. అంతేకాదు గ్లోబల్ కంపెనీ అని పిలవబడే పెద్ద సంస్థకి మొదటి భారతీయ సిఇవో అయ్యారు రాజ్‌గుప్త. బహుళజాతి సంస్థలకి సిఇవో కావడం దానికి, మార్గదర్శి రాజ్‌గుప్త, ఆ తరువాత ఇంద్రనూయి అనే మహిళ సుదీర్ఘకాలం పెప్సికో అనే పెద్ద కార్పొరేట్ కంపెనీకి ఇసివో అయి కోట్లు కురిపించింది. అంతేకాదు మరెంతోమందికి కార్పొరేట్ మేనేజ్‌మెంట్ నిచ్చెన ఎక్కించారు. ఫార్చ్యూన్ 500 అని కార్పొరేట్ రంగంలో పిలవబడే సంస్థలలో ఉద్యోగం రావడం గొప్ప. దానికి సిఇవో కావడం చిన్న విషయం కాదు. మరి ఇప్పుడు సుమారు వందకు పైగా గ్లోబల్ కంపెనీలకి సింగపూర్, కెనడా, ఉగాండా, ఇథియోపియా, లండన్ వంటి దేశాలలో వలస వచ్చి స్థిరపడిన వాళ్లు చదువుకున్నవారు కోకొల్లలుగా గ్లోబల్ సిఇవోలు అయ్యారు. సుందర్‌పిచాయ్ 2015 నుండి గూగుల్, ఇప్పుడు ఆల్ఫాబెట్ అనే గ్లోబల్ కంపెనీకి సిఇఓ అయి పెనుమార్పు తెచ్చారు. తమిళనాడులోని మదురైలో జన్మించి ఐఐటి ఖరగ్‌పూర్ నుండి బి.టెక్, ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఎంబిఎ వార్టన్ బిజినెస్ స్కూల్ నుండి విద్య సాగించారు. మాకిన్సేయ్ అండ్ కంపెనీలో ఉద్యోగం 2004లో గూగుల్ సంస్థలో చేరారు. అక్టోబర్ 2015 నాటికి సిఇఓ అయ్యారు.




గూగుల్ అంటే ఒక సెర్చ్ ఇంజిన్ నుండి ఈమెయిల్ సర్వీస్ మాత్రమే నుండి క్రోమ్, గూగుల్‌మాప్, ఆండ్రాయిడ్ అనే పేరులతో మనకి ఊపిరితో సమానం అయిపోయింది. మొబైల్ ఇంటర్నెట్ పెద్ద విప్లవాన్ని తెస్తుంది అని ముందే గ్రహించిన సుందర్‌పిచాయ్ ఆండ్రాయిడ్, క్లౌడ్ సాంకేతికతను తీసుకొచ్చాడు. వార్త వినిమయ, కార్పొరేట్, టెక్ మేనేజ్‌మెంట్ రంగాలలో పెను మార్పు తెచ్చి మనదేశానికి, యువతకి కొత్త బంగారు లోకాని చూపారు.



## సమూలమార్పుల్ని తెచ్చిన సత్యనాదెళ్ల

ఈ కంప్యూటర్ యుగంలో గూగుల్ గొప్ప ఆవిష్కరణ అమెరికాలోని సిలికాన్ వాలీలో ప్రముఖ సంస్థ మొదటి స్థానంలో ఉండగా, రెండవస్థానంలో మైక్రోసాఫ్ట్ సంస్థ ఉంది. కంప్యూటర్లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అనేలా ఉంటాయి ఈ రెండు కంపెనీలు. ఈ రెండు కంపెనీలలో ఉద్యోగం చేయాలని యువత కోరిక. మన తెలుగు బిడ్డ హైదరాబాద్‌లో పుట్టిన సత్యనాదెళ్ల 2014 నుండి మైక్రోసాఫ్ట్ సిఇవో స్థానంలో ఉండి, మన దేశానికి పేరు తెచ్చారు. వీరిద్దరూ తమ కంపెనీలను సమూలమైన మార్పులు తెచ్చారు. సాంకేతికపరంగాను, వ్యాపారపరంగాను ఈ రెండు సంస్థలు తమతమ ప్రత్యేకతలను అందిస్తున్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ బిరుదును, మిల్వాకీలోని విస్కాన్సిన్ యూనివర్సిటీ నుండి, ఎంబిఏ చికాగో యూనివర్శిటీ నుండి పొందారు. ఆ తర్వాత అప్పటి ప్రముఖ కంపెనీ సన్‌మైక్రోసిస్టెమ్స్‌లో మంచి ఉద్యోగం పొందారు. మైక్రోసాఫ్ట్‌లో 1992లో ఉద్యోగపర్వంలో చేరాడు. అప్పటి నుండి తనలోని సృజన నిబద్ధత చూపుతూ 2014 బిల్‌గేట్స్ నుండి నాయక స్థానాన్ని పొందిన తెలుగు తేజం సత్యనాదెళ్ల. ఛాలెంజ్ చేంజ్, టుడే టు మరో అనే ఆలోచనతో మైక్రోసాఫ్ట్ అనే బహుళజాతి కంపెనీ మన ముందు ఎన్నో అవసరాలు తీర్చడానికి ఉంది.

'సంఘీ' భావం



# గాడి తప్పిన సోషల్ మీడియా

పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు కొన్ని నిబంధనలు, ఆంక్షలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కీలక సమాచారాన్ని అందించే విషయంలో ఈ నిబంధనలు అడ్డు వస్తాయి. అయితే సోషల్ మీడియాకు ఎలాంటి పగ్గాలు లేవు. ఎవరికి ఏదీ తోస్తే అది సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై తోసేసే పూర్తి స్వేచ్ఛ ఉంది. ఈ స్వేచ్ఛ ప్రస్తుతం పూర్తిగా పక్కదారి పట్టింది. ఏదీ నిజమో, ఏది అబద్ధమో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. దురదృష్టవశాత్తు సోషల్‌మీడియాకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేథ) తోడు అయ్యింది. దీనితో వాస్తవాలు పక్కకు పోయి అభూతకల్పనలు రాజ్యం ఏలుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఎదుటి వారిపై బురద జల్లేందుకు, ఉన్నవి లేనివి కల్పించి ఇబ్బందులు పెట్టేందుకు రాజకీయ పార్టీలు ఈ సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నాయి. ఎంతగా అంటే నెలకు కోట్లాది రూపాయలు సోషల్ మీడియాపై ఖర్చు చేస్తున్నారు. ఇది అన్ని రాజకీయపార్టీల్లోను కొనసాగుతోంది. ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యాలయాలు, టీమ్‌లు ఏర్పాటుచేసుకున్నారు. ఈ టీమ్‌లలో పూర్తిస్థాయి సిబ్బంది కొందరైతే అవుట్‌సోర్సింగ్ విధానంలో కూడా వేలాది మందిని నియమించుకుంటున్నారు. ముఖ్యంగా ఎన్నికలు సమీపించడంతో సుమారు సంవత్సరకాలంగా ఈ హడావిడి మరింతగా పెరిగింది. ఒక్కొక్క పార్టీ కొన్ని వందల కంప్యూటర్‌లు సిద్ధం చేసి సోషల్‌మీడియాకు ఉపయోగిస్తున్నారు. ఒక్కొక్కరికి పది నుంచి 30 వేల రూపాయలు జీతాలుగా చెల్లిస్తున్నారు. గ్రాఫిక్ డిజైనర్స్, ప్రోగ్రాం కంటెంట్స్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌లు వంటి అనేక విభాగాలు పనిచేస్తున్నాయి. వీరికి టార్గెట్స్‌గా నిర్ధేశిస్తున్నారు. ప్రత్యర్థులను ఎండగడుతూ ప్రతి రోజూ పోస్టింగ్‌లు చేయాలని, వీడియోలు ఉండాలని ఆదేశిస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లలో వీటిని పోస్టింగ్ చేయాలని నిర్ధేశిస్తున్నారు. ఈ టీమ్ తయారుచేసిన కంటెంట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికి అవుట్‌సోర్సింగ్‌లో కొందరిని తీసుకుంటున్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి లెక్క ఉండటం లేదు. ఎంతమందిని అయినా జాయిన్ చేసుకుంటూ ఉన్నారు. వీరు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి, పార్టీ పంపించే కంటెంట్‌ను పోస్ట్ చేస్తూ ఉండాలి. వ్యూవ్స్, లైక్‌లు, కామెంట్లను లెక్కించి వారికి కొంత మొత్తం చెల్లిస్తూ ఉంటారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వారి దైనందిన జీవితాలను కొనసాగిస్తూ సోషల్‌మీడియా పోస్టింగ్‌లు చేస్తే సరిపోతుంది. వీరికి వారానికి ఒకసారి, నెలకు ఒకసారి లెక్కన డబ్బు చెల్లిస్తారు. తమ ప్రత్యర్థులు చేసే పోస్టింగ్‌లను ఎదుర్కొవలసిన బాధ్యత కూడా వీరికి ఉంటుంది. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పోస్టింగ్‌లను వైరల్ చేయడం ప్రధాన విధి నిర్వహణ. ఒక అబద్ధాన్ని నిజం చేయడానికి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. ఉదాహరణకు ప్రత్యర్థులు ఏదైనా సభ నిర్వహిస్తే జనం రాలేదు అని రకరకాలుగా పోస్టింగ్‌లు చేయడం ద్వారా జనాన్ని నమ్మబలికే బాధ్యత వీరిపై ఉంటుంది. పదేపదే వేర్వేరు అకౌంట్ల ద్వారా పోస్టింగ్‌లు చేయడం, వాట్సప్ గ్రూప్‌లలో తమ పార్టీకి అనుకూలంగా, ప్రత్యర్థులకు ప్రతికూలంగా చర్చలు జరపడం వంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటారు. తమ వద్దకు వచ్చే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కనీసం 20 నుంచి 30 వాట్సప్ గ్రూప్‌లలో సభ్యుడిగానో, అడ్మిన్‌గానో ఉండాలి. ఇక ఫేస్‌బుక్‌లో వచ్చే పోస్టింగ్‌లను ఎప్పటికప్పుడు తీవ్ర పదజాలంలో ఎదుర్కొవలసి ఉంటుంది. పత్రికలలో ఉపయోగించని నీచమైన భాషను సోషల్‌మీడియాలో ఉపయోగించాలని వారికి ముందే తర్ఫీదు ఇస్తారు. పార్టీలకు సంబంధించిన వారు ఒకరిపై మరొకరు బురద జల్లుకునేందుకు వారు సిద్ధంగా ఉంటారు. అయితే ఈ విషయం తెలియని సామాన్యులు పొరపాటున ఏదైనా పోస్టింగ్ పెడితే అదేస్థాయిలో వీరిపై యుద్ధం చేస్తారు. ఎంతగా అంటే మానసిక క్షోభను ఎదుర్కోలేక ఆత్మహత్య చేసుకుందామా అన్న రీతిలో ఎదురుదాడి ఉంటుంది. సామాన్యుల సోషల్‌మీడియా ఖాతాలో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, తోటి ఉద్యోగులు అందరూ ఉంటారు. వీరి చేసిన పోస్టింగ్‌కు వచ్చే నీచమైన భాషలో ఎదురుదాడి రాగానే అందరూ దీనిని చదివే అవకాశం ఉంటుంది. దీనితో సామాన్యులు తలెత్తుకోలేని దుస్థితి ఏర్పడుతుంది. ఫలానా నాయకుడిని ప్రజలు ఎదురు తిరిగి దాడి చేశారని వైరల్ చేసిన అంశాన్ని కొందరు నమ్మే పరిస్థితి ఉంటుంది. అయితే రాజకీయాలపైనా, వాస్తవ పరిస్థితులపై నా కొంత అవగాహన కలిగిన వారు మాత్రం వీటిని లైట్‌గా తీసుకుంటారు. ఒక నాయకుడు ప్రత్యర్థి శిబిరంలో మరో నేతను కలిసినట్లు ఫోటోలు పెట్టి వైరల్ చేస్తారు. లేకపోతే ఎప్పుడో సంవత్సరం క్రితం కలిసిన ఫోటోను తాజా ఫోటోగా సోషల్ మీడియాలో పోస్టింగ్ చేస్తారు. లేదంటే ఒక కుల సంఘం ఫలానా పార్టీకి వ్యతిరేకంగా ఉందని వైరల్ చేస్తారు. సంఘ నాయకులు తాము ఏ పార్టీకి మద్దతుగా లేమని చెప్పినా అవి మాత్రం వైరల్ కావు. తాను అలా చెప్పలేదు అని ఖండించుకోవడం ఆ పార్టీ నేతలకు తలనొప్పిగా మారుతుంది. నిజం గుమ్మం దాటేలోపు అబద్ధం ప్రపంచం తిరిగి వస్తుందన్న సామెత ప్రస్తుతం సోషల్‌మీడియాకు సరిగ్గా సరిపోతుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే సోషల్ మీడియా పోస్టింగ్‌లపై కూడా కఠిన చట్టాలు తీసుకురావాలి. ఎదుటివారిని క్షోభకు గురిచేసే, తప్పుడు సమాచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వైరల్ చేసినా జైలుశిక్షలు పడేలా చట్టాన్ని రూపొందిస్తే కొంతవరకు సోషల్ మీడియా సమాజానికి ఉపయోగకరంగా మారే పరిస్థితి ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# బాబోయ్! ఎండలు..

**అప్పుడే వేసవి వచ్చేసింది. ఈ వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతాపం వలన భూగోళం అగ్నిగోళంలా భగభగమండే నిప్పుల కొలిమిలా మారింది. ఆ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ప్రజలు ఇంటి నుండి బయటికి రావడానికి జంకుతున్నారు.**

కవర్ స్టోరీ

**కందుకూరి భాస్కర్**

ఎండాకాలం రాకముందే ఎండల తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళలో వాతావరణం చల్లబడినా, గత కొద్ది రోజులుగా మధ్యాహ్నం పూట ముఖం మాడిపోయేలా ఎండ దంచుతోంది. ఏప్రిల్, మే నెలలో ఉండాల్సిన ఎండలు మార్చి నెలలోనే ప్రారంభమయ్యాయి. ఈ వేసవి ప్రారంభంలోనే భానుడు ఇలా సెగలు గక్కుతుంటే రాబోయే రోజుల్లో ఇంకా ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు భానుడు చండ ప్రచండంగా తన ప్రతాపాన్ని చూపడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. భానుడి ప్రతాపానికి పగటిపూటే కాదు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యాయి. రాత్రిపూట 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. మార్చి నెలలోనే సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత అధికమవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలను జారీ చేసింది. దీనినిబట్టి రానున్న కాలంలో గత వంద ఏళ్లలో కూడా ఎప్పుడూ నమోదు కాని అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు అయ్యే అవకాశంకూడా ఉంది.

ప్రజలు పగటిపూట ఎక్కడికైనా వెళ్లాలంటే జంకుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఉక్కపోతలు తగ్గడం లేదు. అధిక ఉష్ణోగ్రతలు మనుషులకే కాదు భూమిపై ఉన్న ప్రతి జీవరాశికీ ప్రాణాపాయ పరిస్థితిని కల్పిస్తున్నాయి. తాగడానికి నీళ్ల లేక పక్షులు, జంతువులు విలవిల్లాడిపోతున్నాయి. ఎండవేడిమి తట్టుకోలేక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. పశ్చిమ, ఉత్తర తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో వేడి ఎక్కువగా ఉంటుందని, హైదరాబాద్‌లోనూ ఎండలు అధికంగానే ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది.

వేసవి తాపానికి గల కారణాలు

ప్రజలు విపరీతంగా చెట్లను నరికివేయడం, గుట్టలను, అడవులను ధ్వంసం చేయడం వలన వర్షాలు సక్రమంగా పడడం లేదు. ఇంటి చుట్టూ కాంక్రీటు గచ్చులు, ఇంకుడు గుంతలు లేకపోవడం వలన భూమిలోకి నీరు ఇంకే అవకాశం లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీళ్ల కోసం వందల ఫీట్ల లోతు వరకు బోర్లు వేస్తున్నారు. భవన, ఇతరత్రా నిర్మాణాల కోసం నదీ తీర ప్రాంతాలలో ఇసుకను అధికంగా తవ్వటం, నదులు, ప్రాంతాలు, గ్రానైట్ క్వారీలు ఎక్కువ కావడం వలన, ఎల్‌నినో, గ్రీన్ హౌజ్ ప్రభావం వలన ఉష్ణోగ్రతలు ఏయేటికాయేడు పెరుగుతూనే ఉన్నాయి. భూ, జల, వాయు కాలుష్యాల వలన ఓజోన్ పొర క్షీణిస్తూ అధిక వేడిమి సంభవిస్తుంది.

## ఎండల వల్ల కలిగే దుష్పరిణామాలు

ఎండలు అధికంగా ఉంటే మానవ శరీరంలో నీటి శాతం పడిపోతుంది. ఖనిజ లవణాలు ఆవిరైపోతాయి. శరీరం వేడెక్కుతుంది. నీరసంగా ఉంటుంది. మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగడం అనేక అనర్థాలకు దారి తీస్తుంది. అధిక ఎండల వల్ల వడదెబ్బ తగులుతుంది.



వడదెబ్బ వలన నీసరం, శక్తి తగ్గడం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు, విరోచనాలు, జ్వరం మొదలైన సమస్యలు వస్తాయి. తద్వారా మనిషి డీ హైడ్రేషన్‌కు గురి అవుతాడు. డిహైడ్రేషన్ వలన మనిషి తన శక్తిని కోల్పోతాడు. దానితో ప్రాణహాని కూడా జరగవచ్చు. తీవ్రమైన వడగాలులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అధిక ఎండల వల్ల కరువుకాటకాలు సంభవించ వచ్చు. దానితో విభిన్న రంగాలు అతలాకుతలం అవుతాయి. అది దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుంది.

## వైద్యుల సలహాలు

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వారిచ్చే సలహాలు, సూచనలు పాటించాలి. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్(ఓఆర్ఎస్) తాగాలి. నిమ్మకాయ రసం కూడా తగినంత తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. అవసరం అయితే తప్ప బయట తిరగకుండా ఉండటమే మంచిది. దాహం వేసినా వేయకపోయినా తరచుగా నీళ్ల తాగుతూ ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ద్రవపదార్థాలు తీసుకోవాలి.





## పిల్లలు, వృద్ధులపై ప్రభావం

వేసవి కాలం కావడంతో పిల్లలకు ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. పిల్లలు బడి నుంచి వచ్చాక మిగతా పిల్లలతో కలిసి బయట ఎండలో ఆడుతారు. వేసవి కాలంలో పిల్లలు ఉత్సాహంగా ఆడుకుంటున్నారు కదా అని వదిలేయొద్దు. పిల్లలను ఎండలో ఆడకుండా తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగితే ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంటుంది, కాబట్టిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆటల్లో పడి పిల్లలు నీటిపై ధ్యాస పెట్టరు. కాబట్టి వారికి దాహం వేసినా, వేయకపోయినా మనమే తరచుగా మంచినీటిని తాగించాలి. పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఇచ్చి నీరసం రాకుండా చూడాలి. అదే విధంగా బాలింతలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పాలు తాగే పిల్లలకు తరచుగా పాలు ఇవ్వాలి. ప్రతి సంవత్సరం వేసవిలో ఎంతో మంది వృద్ధులు వడదెబ్బ తగిలి మరణిస్తున్నారు. కాబట్టి వృద్ధులు నీడపట్టునే ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే పదార్థాలను తీసుకోవాలి.



## పెరిగిన విద్యుత్ వినియోగం

పగటిపూట వేడి, రాత్రిపూట అధిక ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్‌గాలి సరిపోకపోవడంతో ప్రజలు కూలర్లు, ఏసీలను వినియోగిస్తున్నారు. వేసవిలో నీటి కొరత ఉంటుంది. ఇప్పటికే పంటలకు సరిపడా నీరు అందడం లేదు. వేసవితాపం తీవ్రమైతే తాగునీటికి కూడా కష్టాలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ప్రజలు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి.

## తీసుకోవలసిన జాగ్రత్తలు

అత్యవసరమైతే తప్ప పగటిపూట బయటకు వెళ్లకూడదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ప్రజలు తమ పనులను పూర్తి చేసుకునే ప్రయత్నం చేయాలి. తరచుగా నీరు తాగుతూ ఉండాలి. శీతలపానీయాలు, బాగా చల్లని నీరు తాగకూడదు. ఓఆర్ఎస్, గ్లూకోజ్ ద్రవణాన్ని తాగాలి. కొబరినీళ్లు, నిమ్మరసం, చెరకురసం, మజ్జిగ, పండ్ల రసాలు లాంటి ద్రవపదార్థాలను తీసుకోవడం వలన త్వరగా శక్తిని పొందవచ్చు. వేసవి తాపాన్ని తీర్చడంలో ప్రధానమైనది పుచ్చకాయ (కర్బూజకాయ), ఇందులో నీటితోపాటు మినరల్స్, విటమిన్లు పుష్కంగా ఉంటాయి. కాబట్టి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. ముల్లంగి, కీరదోస, క్యారట్ జ్యూస్ శరీరానికి చల్లదనాన్ని కలిగిస్తాయి. గంజి, సగ్గుబియ్య జావ, ఉల్లిపాయలు కూడా అధికంగా సుకుంటే వేడిమి నుండి ఉపశమనం పొందవచ్చు. ముదురురంగు దుస్తులు వేడిని తొందరగా గ్రహిస్తాయి. కాబట్టి వేసవిలో వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులను ధరించాలి. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులు, దినసరి కూలీలు, రోడ్డుపక్క వ్యాపారం చేసేవారు, తోపుడు బండ్లవారు, రిక్షా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంటుంది. కావున వారందరూ ఎండబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



బయటికి వెళ్లేటప్పుడు నెత్తిన టోపీ పెట్టుకోవాలి. లేదా గొడుగు తీసుకువెళ్లాలి. చలువ కళ్లద్దాలు, తెల్లరంగు వదులు దుస్తులు ధరించాలి. నీళ్ల సీసా వెంట తీసుకువెళ్లాలి. ఉదయం సాయంత్రం స్నానం చేయాలి. మసాలాలతో వండిన ఆహారం, వేపుళ్లు, మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. ఎండవేడిమితో శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటికు వెళ్లిపోతుంది. కావున తరచుగా నీటిని తీసుకోవాలి. చర్మ సంరక్షణ కొరకు బీట్‌రూట్, క్యారెట్ వంటి పచ్చి కూరగాయలు తీసుకోవాలి. తరచుగా చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి. ముఖం పొడిబారకుండా తేమగా ఉండేలా చూసుకోవాలి. తగినంత నిద్రపోవాలి.

### మనం ఏం చేయాలి

మొక్కలు నాటకుండా, చెట్లను పెంచకుండా పర్యావరణాన్ని కాలుష్య కొరల్లోకి నెడుతున్న ఆధునిక మానవుడి వికృత చేష్టలను భూమాత కూడా భరించలేకపోతున్నది. భూమి, సూర్యుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నది. నిర్లక్ష్యమైన మానవ తప్పిదాలు భూమిపై ఉన్న సమస్త జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రజలలో సరైన అవగాహన కల్పించి హరితహారం, వనమహోత్సవం లాంటి కార్యక్రమాల్లో ప్రజలందరు చురుగ్గా పాల్గొని విజయవంతం చేసేలా చూడాలి. మొక్కలను నాటి వాటికి సంరక్షణ చర్యలు చేపట్టాలి. మారిన వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు సరికొత్త సాగు పద్ధతులను సృజనాత్మక ఆలోచన విధానంతో చేయాలి. జంతువులకు, పక్షులకు నీటిని అందుబాటులో ఉంచాలి. వేసవి బారి నుండి ప్రజలను కాపాడటానికి అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఎండల వలన ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వైద్యఆరోగ్యశాఖ తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. మానవుడు పది కాలాలపాటు చల్లగా ఉండాలంటే ఇకనైనా మనిషి తనను తాను ప్రశ్నించుకొని మార్పు చెందవలసిన అవసరం ఎంతైనా ఉంది.





# గ్రాఫీన్ కుకర్

అత్యంత పలచగా ఉండి కూడా శక్తిమంతమైనదిగా పేరొందిన సరికొత్త పదార్థం..గ్రాఫీన్ ఇప్పుడిప్పుడే వాడుకలోకి వస్తోంది. స్టీలు కన్నా రెండువందల రెట్లు బలమైన ఈ పదార్థం మంచి ఉష్ణ, విద్యుత్ వాహకంగా పనిచేస్తుంది. ఆ లక్షణాన్ని దృష్టిలో పెట్టుకుని దక్షిణ కొరియాకు చెందిన గ్రాఫీన్ స్క్వేర్ కంపెనీ దీన్ని వంటగదిలోకి తెచ్చింది. ఈ సంస్థ తయారు చేసిన కుకర్ ఈ ఏడాది వినియోగ వస్తువుల ప్రదర్శనలో సందర్శకులను ఆకట్టుకుంది. కార్డ్‌లెస్, రీఛార్జబుల్, ట్రాన్స్‌పరెంట్..కుకర్ వంటకు సంబంధించి పర్యావరణ మిత్ర సాంకేతికతలో కొత్త శకానికి నాంది పలుకుతుందంటున్నారు పరిశోధకులు. మొదట ఎంతో నాజుకుగా కన్పించే గ్రాఫీన్ కిచెన్ స్టైలర్ (టోస్టర్ లాంటిది)ని తెచ్చిన ఈ కంపెనీ ఆ సాంకేతికతను మరింతగా అభివృద్ధి చేసి ఈసారి కుకర్‌ని తెచ్చింది. పెట్టె లాగా ఉండే ఈ కుకర్‌లో పైనాకిందా గ్రాఫీన్ పొరలు పరుస్తారు. గాజు గిన్నెలో పదార్థాలను పెట్టి వండుకోవచ్చు. పెట్టె పారదర్శకంగా ఉండడంతో పదార్థాలు ఉడికిందీ లేనిదీ తెలిసిపోతుంది. తక్కువ సమయంలో ఎక్కువ వేడితో పదార్థాలు త్వరగానూ రంగుమారకుండానూ ఉడికిపోతాయి. నేరుగా కరెంటు కనెక్షన్ అవసరం లేదు. లిథియం అయాన్ బ్యాటరీలతో ఈ కుకర్ పనిచేస్తుంది. మామూలు విద్యుత్ కుకర్లతో పోలిస్తే చాలా తక్కువ శక్తిని వినియోగించుకుంటుంది. త్వరలోనే మార్కెట్లోకి రాన్నది.











# తినే ఫ్లవర్‌వాజ్‌లు

ఈ ఫొటోల్లోను వాజులను తినేయొచ్చు తెలుసా! ఎందుకంటే ఆ వాజులోని పూలూ, వాటితోపాటు ఉండే ఆకులూ, మొగ్గలూ..అన్నీ చక్కెర, ఇతర పదార్థాలతో తయారు చేశారు కాబట్టి.

పూలకుండీలూ, పూలబొకేల మాదిరి ఈ చక్కెర పూలవాజుల్నీ బహుమతిగా ఇచ్చే వారి సంఖ్య పెరగడంతో వీటికి డిమాండ్ పెరిగింది.

కేకులపైన రకరకాల బొమ్మల్ని చేసేందుకు ఫాండంట్‌న ఉపయోగిస్తారనేది తెలిసిందే కదా..అదేవిధంగా ఈ పువ్వులను తయారు చేసేందుకు ప్రత్యేకంగా గమ్‌పేస్ట్ లేదా ఫ్లవర్ పేస్టు అని దొరుకుతుంది. ఈ పేస్టును కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కజొన్నపిండీ, నీళ్ల అద్దుకుంటూ రకరకాల ఆకృతుల్లో లను తయారు చేస్తారు. ఆ తరువాత ఎడిబుల్ రంగుల్ని అద్దడంతో ఆ పూలు అప్పుడే కోసినట్లుగా, సహజంగా కనిపిస్తూ అబ్బురపరుస్తున్నాయి.













# పోషకాల నిధి కర్బూజా



**ఎండాకాలం వచ్చిందంటే మొదటగా మనకు గుర్తొచ్చేవి..కమ్మకమ్మని మామిడి పండ్లూ, చల్లచల్లని పుచ్చకాయలూ. కానీ వాటి వెంటే వేసివిలో తీయని రుచితోపాటూ ఆరోగ్యాన్నీ ఇచ్చే మరో పండే కర్బూజా. లేత పీచ్‌రంగులో తియ్యని వాసనతో ఆకట్టుకునే ఈ పండు సంగతులూ, దానిలో ఉన్న ఔషధగుణాలూ తెలిస్తే..వెంటనే తినేస్తారు.**

ఒకరికి ఎర్రని నిగారింపుతో మెరిసే ఆపిల్ రుచి నచ్చితే, మరొకరు మన ఇంటి పండులా అనిపించే బొప్పాయి తీపిని ఇష్టపడతారు. ఇంకొకరు చూస్తేనే తినాలనిపించే నారింజ పులుసును ఆస్వాదిస్తుంటారు. ప్రతి పండూ ప్రత్యేకమైందే. దేని రుచి దానిదే అయినా తమతమ అభిరుచుల్ని బట్టి ఇలా ఒక్కొక్కరు ఒక్కో పండును ఎంచుకుంటారు. కర్బూజా పండు విషయంలోనూ సరిగ్గా ఇదే మాట వర్తిస్తుంది. దీని రంగు రుచీ ఇష్టపడే వాళ్లు..'ఎక్కువగా తియ్యగానో, కాస్త చప్పగానో ఉండే ఈ పండు వాసనే నచ్చదంటూ' కనీసం చిన్న ముక్కైనా నోట్లో పెట్టుకోరు మరికొందరు. కర్బూజా అనగానే బయట వలలాంటి నిర్మాణంతో ఉన్న గరుకు తోలూ, లోపల లేత నారింజ రంగు గుజ్జుతో ఉన్న పండే మన దగ్గర ఎక్కువగా కనిపించేది. కానీ ఇప్పుడు పసుపు రంగులో దోసకాయంత సైజు ఉన్న సన్ మెలన్, ఆకుపచ్చ రంగులో ఉండే హనీ డ్యూ, చారలతో తీయగా ఉండే స్లైట్ మెస్కెమెలన్‌లాంటి రకాలూ దొరుకుతున్నాయి. ఈ కర్బూజాల్లో వివిధ దేశాల్లో వేరువేరు వెరైటీల్ని చూడొచ్చు. తెల్లగా ఉండే వైట్‌హనీ డ్యూ, ఆకుపచ్చని గాలియా, పసుపు రంగులోని పర్షియన్, కోలగా ఉండే శాంటా క్లాజ్, పియర్‌పండు ఆకారంలో ఉండే క్రెన్షాలాంటివి చాలానే ఉన్నాయి. ఇవేకాక, చక్కెర శాతాన్ని తగ్గించి, సిట్రస్‌ని పెంచి హైబ్రిడ్ నిమ్మరుచి లెమన్‌డ్రాప్, చాలా తీయగా ఉండే హైబ్రిడ్ గ్రీన్ ఫ్లెష్ మస్క్ మెలన్లలాంటివీ వచ్చాయి. జ్యూసు తీసుకోవడంతో పాటు, ఫ్రూట్ సలాడ్లలోనూ వేసుకునే ఈ పండ్లలో కొన్నింటిని ఏడాదంతా పండిస్తున్నారు. మనదేశంలో కర్బూజా సాగుకు మంచి పేరున్న ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని రైతులు చాలామంది కర్బూజా వెరైటీ రకాల్ని పండిస్తూ ఈమధ్య చక్కని ఫలితాలు పొందుతున్నారు. పంట దిగుబడికి సరైన పద్ధతులు పాటిస్తూ వేల రూపాయల పెట్టుబడితో లక్షల రూపాయలూ సంపాదిస్తున్నారు.



## పండిస్తున్న దేశాలు

ప్రస్తుతం అత్యధికంగా కర్బూజా పంటను పండిస్తున్న దేశాల్లో వరసగా చైనా, టర్కీలాంటివి ఉన్నా..ఈ పండు మాత్రం ఇరాన్‌కి చెందినదని చెబుతారు. భారత్‌లోని కశ్మీర్‌లోనూ, అఫ్గనిస్థాన్‌లోనూ ఎప్పటి నుంచో కర్బూజాని సాగు చేసేవారట. క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలో గ్రీసుదేశంలో కర్బూజాని ఎక్కువగా పండించేవారట. కరబ్బూజాలోని ఔషధ గుణాల్ని తెలుసుకున్న గ్రీకులూ, రోమన్లూ ఈ పండును ఆహారంలో భాగం చేసుకున్నారట. మంచి చేస్తుందంటే ఎవరికైనా నచ్చకుండా ఉంటుందా? అందుకే ఆరోగ్యానికి మేలు చేసే ఈ పండు ప్రపంచవ్యాప్తంగా పాకిపోయింది.

కర్బూజా శాస్త్రీయనామం కుకుమిస్ మెలో. రూపునీ, రుచినీ బట్టి కర్బూజాకి మస్క్‌మెలన్ అనే పేరొచ్చింది. పర్షియన్ భాషలో మస్క్ అంటే సువాసన అనీ, ఫ్రెంచ్ పదం మెలన్ అంటే యాపిల్‌లాంటి ఆకారం అనీ అర్థమట. అలా ఈ రెండు పదాల్ని కలిపి మస్క్‌మెలన్ అన్న పేరు పెట్టారన్నమాట.

- కర్బూజా ఎక్కువశాతం నీటితో ఉండటం వల్ల ఈ పండును తింటే దాహం తీరడమే కాకుండా, ఇందులోని ఎలక్ట్రోలైట్ల వల్ల అలసట తగ్గి తక్షణ శక్తి వస్తుంది. దీంట్లోని అధిక నీరు అధిక నీరు-జీర్ణాశయాన్ని తేమగా ఉంచుతూ టాక్సిన్లను బయటకు పంపిస్తుంది.

➡ ఈ పండులో విటమిన్-సి పుష్కలంగా ఉంటాయి. విటమిన్-సి వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా తెల్లరక్తకణాల వృద్ధికి తోడ్పడటమే కాకుండా ఇన్‌ఫెక్షన్లను దరిచేరనివ్వదు.

విటమిన్ ఎ కంటికి సంబంధించిన సమస్యలను దూరం చేస్తుందట. ఈ పండు ఎక్కువగా తినేవారిలో కంటి శుక్లాలు వచ్చే అవకాశం చాలా తక్కువ.



➡ దీంట్లో సమృద్ధిగా ఉండే కెరోటినాయిడ్లూ, కుకుర్బిటాసిన్లూ శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తూ రకరకాల కేన్సర్లనీ, నరాల వ్యాధుల్నీ తగ్గిస్తాయట.

➡ తక్కువ క్యాలరీలూ, ఎక్కువ పీచూ ఉంటాయి కాబట్టి..ఇది బరువు తగ్గడానికి ఎంతో సాయపడుతుంది. ఈ పండులోని ప్రోటీన్లూ, కొల్లాజెన్ పదార్థాలూ కణాల పునర్నిర్మాణానికి సాయపడతాయి. దాంతో చర్మం త్వరగా వడలిపోకుండా నిగనిగలాడుతూ ఉంటుంది. ఆరోగ్యకరమైన జుట్టుకీ దీంట్లోని విటమిన్లు ఎంతగానో ఉపయోగపడతాయట.

➡ కర్బూజాలోని ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు మేలు చేస్తుంది. ఇంకా దీంట్లోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పిని తగ్గించే శక్తి ఈ పండుకి ఉందట.



➡ దీంట్లోని కొన్ని పదార్థాలు కిడ్నీలో రాళ్లను కరిగిస్తాయి. ఒత్తిడిని తగ్గించి నిద్రపోయేలా చేస్తాయి. ఇంకా మధుమేహాన్ని నియంత్రిస్తాయి.

➡ రోజూ ఈ పండ్ల రసాన్ని తాగితే ఎగ్జిమా లాంటి చర్మసంబంధ వ్యాధులు త్వరగా నయమవుతాయట. అజీర్తి, పోషకాల లేమి, తరచూ నీరసంతో బాధపడేవాళ్లకు ఈ పండు మంచి ఆహారం.

ఎండల్లో చల్లదనాన్నే కాదు, మరెన్నో రకాలుగా ఉపయోగపడే కర్బూజా పండు విరివిగా దొరికే సమయం ఇదే. మరెందుకాలస్యం..ఈ వేసవి అంతా కర్బూజాని నోరారా తింటూ కడుపు చల్లగా ఉంచుకుందామా! పండును పండుగానే తింటే తృప్తి తీరక మిగతా పండ్లలాగే ఈ కర్బూజా పండుతోనూ ఎన్నో ఆహారపదార్థాల్ని తయారు చేస్తున్నారు. ఒమేగా-త్రీ అత్యధికంగా ఉండే ఈ పండులోని గింజల్ని నేరుగానూ ఇతర పదార్థాలతోనూ కలిపి తింటున్నారు. పండ్లరసాలూ, సలాడ్లూ, స్మూతీలూ, ఐస్క్రీముల్లోనూ ఈ కర్బూజాని చేర్చుతున్నారు.



### కర్బూజా నుంచి అందే పోషకాలివి

శక్తి: 34 క్యాలరీలు, నీరు: 90.2 గ్రాములు, చక్కెర: 8గ్రా, పిండిపదార్థాలు: 8.2 గ్రా, కొవ్వులు: 0.9గ్రా, కొవ్వులు: 0.84 గ్రా, కాల్షియం: 9 మి.గ్రా, ఐరన్: 0.21 మి.గ్రా, మెగ్నీషియం: 12 మి.గ్రా, ఫాస్ఫరస్: 15 మి.గ్రా, సోడియం: 16 మి.గ్రా, పొటాషియం: 267 మి.గ్రా, జింక్: 0.18 మి.గ్రా, జింక్: 0.18మి.గ్రా, విటమిన్‌ఎ: 169 మైక్రోగ్రాములు, విటమిన్-కె: 2.5 మైక్రోగ్రాములు. ❒

# టీచర్లకు డ్రైవింగ్ శిక్షణ



బిహార్ మారుమూల ప్రాంతాల్లోని స్కూళ్లలో పని చేయడానికి మహిళా టీచర్లు ఇష్టపడడం లేదు. కొందరేమో సమయానికి స్కూలుకు హాజరు కాకపోవడం, తరచూ సెలవులు పెడుతుండటం గమనించారు విద్యాశాఖ అధికారులు. టీచర్లు అక్కడ పని చేయడానికి ఇష్టపడకకాదనీ, రోడ్డు వసతి లేక రవాణా సదుపాయాలకు దూరంగా ఉన్న ఆ గ్రామాలకు చేరుకోలేకపోవడమే అసలు కారణమని తెలుసుకున్నారు. అందుకే బిహార్ రాష్ట్ర విద్యాపరిశోధక, శిక్షణ మండలి ఓ ఆలోచన చేసింది. స్కూలు పని వేళల్లోనే రోజుకు ఓ గంట మహిళా టీచర్లకి స్కూటీ నడపడం నేర్పిస్తోంది. కొత్తగా నియామకం అయిన వారికి విధుల్లో చేరకముందే డ్రైవింగ్ నేర్పించి లైసెన్స్ కూడా అందిస్తోంది. రాయితీతో స్కూటీలు కొనుక్కోవడానికీ ప్రోత్సహిస్తోంది. మూడునెలలకు బిహార్ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం వల్ల డ్రైవింగ్ నేర్చుకున్న దాదాపు వందమంది టీచర్లు స్కూటీలపైన సమయానికి స్కూళ్లకు చేరుకుంటున్నారు. ఎక్కువ సమయం కూడా కేటాయించి గ్రామీణ విద్యార్థులకు అదనపు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేసిన ఈ ఆలోచన బాగుంది. అంతేకాదు వారు తమ సొంతపనులను కూడా కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా చేసుకోగలుగుతున్నారు. ❒



**మమతల** కలలు మన కళ్లముందు
కరిగిపోతుంటే
ఎదురు చూసిన క్షణాలు కల్లలై
జారిపోతుంటే
మనసులోని ఆశలు నిరాశలై
నీరుగారిపోతుంటే
అంతరంగంలో నిర్మించుకున్న
అనురాగ సౌధాలు పేకమేడల్లా
కూలిపోతుంటే భావిభారత పౌరుల
అనుసృజన చచ్చిపోగా

# ఏది మన ప్రస్థానం?



ఈవారం కవిత్వం

మనిషికీ మనిషికీ మధ్య
నానాటికీ అంతరించిపోతున్న
కృతజ్ఞతా భావం హారతి కర్పూరంలా
ఆవిరైపోతుంటే
ఎటు వెళుతుందీ ప్రస్థానం?
ఏమౌతుందీ మన ప్రస్థానం?
మరి ఎక్కడుంటుందీ మనకి స్థానం.
కలల ఊహా సామ్రాజ్యంలో

## ప్రేమించాను నిన్నే!

**ప్రేమంటో** ఏమిటో..
నిన్ను చూశాక తెలిసింది
మనసంటే ఏమిటో..
అది నీకిచ్చాకే తెలిసింది
నా గుండె గుడిలో నీ రూపం
నా మనసు నిండా నీ ధ్యానం

ప్రతి నిత్యం నీ నామాన్ని జపిస్తూ
నీ రూపాన్ని నా ఊపిరిలో నింపుకున్నా
కనులు తెరిచి నిన్ను చూడలేక
కనులు మూసి చూస్తున్నా
ప్రేమించాను నిన్నే
మరిచాను నన్ను నేనే.

నీ తలపులలో నిన్నే ఆరాధిస్తూ
నీ ఊహల్లో బతికేస్తున్నా
నీ ఆలోచనల్లో సతమతమవుతూ
నిరంతరం నీ కోసం తపిస్తున్నా
నీవు లేని జీవితం శూన్యంగా
నీ ప్రేమ కోసం భారంగా.

**- కాయల నాగేంద్ర**

## కష్టం

**కష్టం** నన్ను ఎప్పుడు పలకరిస్తూనే ఉంటుంది.
గాలిలా నా చుట్టూ తిరుగుతుంది.
వానలా కురుస్తుంది.



భూమిలా నన్ను అంటిపెట్టుకొని ఉంటుంది.
ఆకాశమంత రూపమై నన్నే చూస్తుంది.
అగ్నిలా దహిస్తుంది.
సముద్రంలా నా ఎదలో ఉప్పొంగుతుంది.
అలలై ఎగసిపడి అమాంతం తనలో..
కలిపేసుకోవాలని ఉవ్విళ్లూరుతుంది.
నేనంటే ఎంత ప్రేమో కష్టానికి!

సాలెగూడులా అల్లుకొని
బంధించాలని చూస్తుంది
కాలం పెడుతున్న పరీక్ష కదా!
ఎంత జాగ్రత్తగా రాస్తున్నానో నాకే తెలుసు!
కష్టం కత్తుల వంతెనై కాపుకాస్తుంది.
నడుస్తుంటే నెత్తుటి ధారల ప్రవాహం.
ఎదిరేది లేదు.. బెదిరేది లేదు.
చివరి వరకు ప్రయాణించడమే.
గమ్యాన్ని ముద్దాడి గెలిచేవరకు.

**- అశోక్ గోనె**


## పుస్తక సమీక్ష




## కొత్తదారిలో 'మూడుదారులు'

చరిత్రను రచించడం చాలా కష్టం. ఆ చరిత్రకు ప్రత్యక్ష సాక్షి అయినవారు రాయడమంటే నిజంగా కత్తిమీద సాములాంటిదే. కాలు తెగకుండా యుద్ధంలో గెలవాల్సి ఉంటుంది. 'మూడు దారుల'లో వెళ్తూ అటువంటి సాము చెక్కు చెదరకుండా చేసినవారు సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్. నాలుగున్నర దశాబ్దాల పాత్రికేయ జీవితంలోని అనుభవాలను రంగరించి దాదాపు 40 యేళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రకు అద్దం పట్టారు. శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వంలో 1978లో కాంగ్రెస్(ఐ) ఏర్పడినప్పటి నుంచి 2014లో రాష్ట్ర విభజన జరిగే దాకా ఎన్నెన్నో అనూహ్యపరిణామాలు. నాలుగు దశాబ్దాల పాటు తాను ప్రత్యక్షంగా చూసిన, రికార్డు చేసిన అంశాలనేగాక తెలుసుకొన్న అంశాలలోని నిజానిజాలను బేరీజు వేసుకొంటూ వాస్తవాలను గ్రంథస్థం చేయడానికి రచయిత ప్రయత్నించారని 202 పేజీలలోగల ప్రతివాక్యంలోనూ కనిపిస్తుంది. ముఖ్యంగా చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌ల భిన్నమైన వ్యక్తిత్వాలు, వారి ఆలోచనా ధోరణులు, రాజకీయ మార్గాలను తనదైన విశ్లేషణతో అందించారు. మర్రిచెన్నారెడ్డి నుంచి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు 11మంది ముఖ్యమంత్రులతోపాటు ప్రస్తుత విభజన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సంభవించిన పరిణామాలను విశ్లేషిస్తూ రచనసాగింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కావడానికి ముందు, తర్వాత సంభవించిన రాజకీయ పరిణామాలు మొత్తం దేశం దృష్టిని ఆకర్షించడంతో నాటకీయంగా సాగిన పరిణామాలన్నిటిని ఎంతో ఉత్కంఠభరితంగా పాఠకులకు అందించారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు నుంచి జగన్‌దాకా అందరూ సిఎంల వర్ణచిత్రమాలిక కూడా చక్కని కూర్పు. మొత్తానికి చక్కటిరిఫరెన్స్ బుక్‌గా 'మూడుదారులు' చెప్పవచ్చు. **(మూడుదారులు, రచన: దేవులపల్లి అమర్, వెల: రూ 395, ప్రతులకు: రూపాపబ్లికేషన్స్, న్యూఢిల్లీ, అన్ని ముఖ్యమైన బుక్‌హౌస్‌లు)** **-ఎ.వి.వి.ప్రసాద్**

## మలగనిబత్తి




ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు రచించిన మలగని బత్తి, తెలుగులో ఏకపుస్తకంగా వచ్చిన తొలి నవలాత్రయం. 1908 నుండి 2018 దాకా 110 సంవత్సరాల తెలంగాణ చరిత్ర చెప్పిన ఈ నవలాత్రయం ఎన్నో జీవన పార్శ్వాలను ప్రతిబింబిస్తూ, ఒక సమగ్ర జీవన దృశ్యాన్ని పాఠకుడి కళ్లముందు నిలుపుతుంది. మలగని బత్తిలోని వస్తువు, దానిపై రచయితకున్న నిజాయితీతో కూడిన సాధికారత, దాన్ని తీర్చిదిద్దిన విధానం, చిత్రణలో నైపుణ్యం, శిల్ప సంవిధానాలు పాఠకుడిని ఆకట్టుకుంటాయి. తెలంగాణ మాండలీకంలో వున్న సొగసులు, పలుకుబడులు, నుడికారాలు ఈ నవలలో కళాత్మకంగా అక్షరరూపం దాల్చాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో రాజన్న అమరత్వం నుంచి నక్సలైట్‌గా మారిన అతని కొడుకు దుర్గయ్య నిబద్ధత, అతని మునిమనమడు రాజు తెలంగాణ కోసం ఆత్మాహుతి చేసుకోవడం దాకా, కథనం పాఠకుడి మనస్సును కదిలించే ఆర్ద్రతతో కూడిన అనేక మలుపులు తిరుగుతుంది. చారిత్రక నవలలు సంప్రదాయంలో ఎన్నతగిన నవల మలగని బత్తి. **(మలగని బత్తి, రచన: ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు, వెల: రూ 300, ప్రతులకు: ఇ.నం.9-14/-, రవీంద్రనగర్ కాలనీ, హబ్సిగూడ, హైదరాబాద్)** **- హర్షితసాయి**

విశ్వసాహిత్యంలో వేదాలు అత్యంత ప్రాచీన వాఙ్మయం. భారతదేశపు అమూల్య, అపూర్వసంపద. ఇవి ఒక్కరో ఒక యేడో రాసినవికావు. కృష్ణద్వైపాయనుడు అనుమహర్షి వేదాలన్నింటినీ 4గా విభజించి 'వేద వ్యాసుసు'డయ్యాడు. వేదాలు 101 శాఖలుగా ఉన్నాయంటారు. కాని 86శాఖలు మాత్రమే లభ్యమట! వైశంపాయనులవారు మిగిలిన 16ను కూడా




## మూలగ్రంథాన్ని తలపించే అనుసృజన

ప్రాచుర్యంలోకి తేవాలన్న కోరిక ఉండేదట. వీరి శిష్యుడే యాజ్ఞల్క్యుడు. విశేషప్రతిభాశాలి నేటి గుజరాత్ రాష్ట్రంలో విశ్వామిత్రుడి వంశజుడైన దేవరాత, ఆలంబినిల పుత్రుడే యాజ్ఞవల్క్యుడు. దేవుడెవరు? ఎక్కడ ఉంటాడు అన్న ప్రశ్నలకు జవాబు కనుక్కోవాలన్న ఉత్సుకతలో వ్యాసుల వారి శిష్యుడు వైశంపాయనుల వద్ద చేరతాడు. ఒకానొక సంఘటనవల్ల నేర్చుకున్నదంతా గురువుగారికి ఇచ్చివేసి ఇల్లు చేరుకుంటాడు. తిరిగి హిమాలయాలకు వెళ్లి అధ్యయనం కొనసాగిస్తాడు. కాత్యాయని, మైత్రేయిలు వారి భార్యలు. జనకుని కొలువు కైమిథిలకు వెళ్తుండేవాడు. జనకుని ఆస్థానంలో ఉన్న పండితులను తన జ్ఞానంతో ఓడించి, ఆయనను తన శిష్యుడిగా చేసుకుంటాడు. పలుస్మృతులు యోగగ్రంథాలు రచించి, సన్యసించి, హిమాలయాలకు వెళ్తాడు. ఇదీ ఈ గ్రంథ సారాంశం. **(యాజ్ఞవల్క్య, నవల, కన్నడ మూలం: హెచ్.ఎల్.ఎన్.శాస్త్రి, అనుసృజన: వేలూరి కృష్ణమూర్తి, వెల: రూ 150, ప్రతులకు: పాలపిట్ట బుక్‌హౌస్‌లు)**


**- కూర చిదంబరం**

కాలంతో సంభాషణ అంటూ ఎం.రాఘవాచారి చక్కటి విలువైన ముందుమాట రాసారు. రాజస్థాన్ నుండి తంజావూర్, మధురదాకా పలు ప్రాంతాలు, రాజప్రసాదాలు సందర్శిస్తూ వాటిని విశ్లేషిస్తూ నేటి స్థితిగతులు రాజ్యాంగం పూర్వకాల ఆచార

## రాజుల బూజులు-చదువుల సారం



వ్యవహారాలు, ప్రపంచీకరణతో వచ్చిన మార్పులు.. వ్యాసాల రూపంలో అందించారు రచయిత. బిగ్‌బ్యాంగ్ థియరీ నుండి నేటి పరిస్థితుల దాకా క్లుప్తంగా క్షుణంగా అధ్యయనవాదులకు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తకరంగా వ్యాసాలున్నాయి. చరిత్ర అధ్యయనం క్రీ.పూ. 10500 నుండి క్రీ.పూ 4500-2000 దాకా నియోలిథిక్ (కొత్త రాతియుగం) ఎలా అంటారు. ఈకాలంలో వ్యవసాయం ప్రారంభం అయింది. క్రీ.పూ.2,900 నుండి క్రీ.పూ.1150 వరకు కంచుయుగం, క్రీ.పూ 1100 నుండి ఇనుపయుగం ప్రారంభమైంది. ప్రజల సొమ్ము పాలకుల సోకు అన్న వ్యాసంలో క్రీ.పూ 1500 సం॥ కాలం నాటి కురపాంచాల ప్రాంతాలల్లో వైదిక ఆర్యుల కాలం ఆరంభం అయింది. (పేజీ.51) త్యాగాల తెలంగాణ వ్యాసంలో 1997 వరంగల్ డిక్లేరేషన్‌కు కాళోజి, సాయిబాబ, వరవరరావు, ప్రొ॥జయశంకర్ వంటి పెద్దలు చేసిన తీర్మానాలు లాంటి విషయాలు 2001లో అధికారిక పరమావధిగా ఓ రాజకీయ పార్టీ తెరమీదకు వచ్చింది. **(రాజుల బూజులు చదువుల సారం, రచన: వీరగోని పెంటయ్య, వెల: రూ 120,ప్రతులకు: వీరగోని లక్ష్మి, 9-1-217, కరీంనగర్)** **- తంగిరాల చక్రవర్తి**



# పవిత్ర మదీనా, మక్కాను దర్శిద్దాం

ఆధ్యాత్మిక దివ్యక్షేత్రాల్లో మదీనా రెండవదిగా చెప్పవచ్చు. ఉమరా చేసే వారు ఇక్కడి మస్జిదే నబవ్విలో క్రమం తప్పక 40 నమాజులు చేస్తే స్వర్గస్థులౌ తారనే నమ్మకం ఉంది. ఈ దివ్యక్షేత్రానికి ప్రతి రోజూ ఉమరా చేసే వారు లక్షలాది మంది వస్తున్నారు. ఇక్కడ రోజురోజుకు పెరుగుతున్న భక్తుల సౌకర్యార్థం మస్జిద్ వైశాల్యాన్ని పెంచుతున్నారు. గతంలో ఒకే మసీదు ఉండగా ప్రస్తుతం చుట్టూ పెంచుతున్నారు. భక్తిభావంతో పాటు ఏకాగ్రతను కల్పించుటకు తీర్చి దిద్దుతున్నారు. మస్జిదే నబ్విలో అడుగుపెడితే ఇక బయటి ప్రపంచాన్ని మరచిపోయేలా ఆధ్యాత్మిక చింతన కల్గే విధంగా తీర్చి దిద్దుతున్నారు. ఇక్కడి మస్జిద్‌లో స్థంభం స్థంభానికి వందలాది 'దివ్యఖుర్ఆన్‌లు' దర్శనమిస్తాయి. ఈ దివ్యక్షేత్రాన్ని దారుల్ హిజరత్ అని కూడా పిలుస్తారు. పూర్వం ఈ ప్రాంతాన్ని 'ఎస్‌రిబ్' అని పిలిచేవారు. ఈ పేరును అల్లాహ్‌యే మార్చారని పండితులు తెలుపుతారు. ఈ మసీదులో ఒక రకాతు నమాజు ఆచరిస్తే 50వేల రకాతుల నమాజు అచరించినట్లు అని మత గురువులు వివరిస్తున్నారు. ఇక్కడే 'రియాజుల్ జన్నా' అనే స్థలం ఉంది. ఇక్కడ 2 రకాతుల నమాజు ఆచరిస్తే జన్నత్(స్వర్గంలో) ఆచరించినట్లు అని చెబుతారు. ఇక్కడే మహమ్మద్ సొల్లె అలా సొల్లం సమాధి ఉంది. అలాగే మరో ఇద్దరు ప్రవక్తలు సమాధులు కూడా ఉన్నాయి. అంతటి దివ్యక్షేత్రం మదీనా. ఈ మసీదు 4,16,475 చదరపు మీటర్లలో మసీదు నిర్మాణం ఉంది.

### మదీనా చరిత్ర:

ప్రాచీన నామం ఎస్రిబ్. రోమన్లతో జరిగిన యుద్ధంలో యూదులు ఓడిపోయి కాందిశీకులుగా అరేబియాలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. తరువాత కాలం "మదీనతున్ నబి" (ప్రవక్త నగరం), అల్ మదీనా అల్ మునర్వ (ప్రకాశింపబడిన, జ్ఞానోదయం, తేజో నగరం) సూక్ష్మంగా మదీనా అంటే అర్థం నగరం. ఇది 338 కి.మీల ఉత్తరాన ఎర్ర సముద్రానికి తూర్పున 190కి.మీల వున్నది. ఇది ఇస్లాం మతస్తులకు మక్కా తరువాత మదీన రెండవ పెద్ద ప్రార్థనాస్థలం.

**మస్జిదే నబవ్వి:** మదీనాలో. జిద్ అల్ హరామ్‌ను పోలి వుంటుంది. ఇక్కడ ఒక నమాజు చేస్తే ఇతర మసీదులలో చేసే నమాజు కన్నా 1000రెట్లు పుణ్యఫలం వస్తుందని ప్రతీక. మూడు ఎత్తైన మినార్లతో నిర్మించబడి వుంటుంది. మస్జిద్ ప్రక్కనే ప్రవక్త సమాధి వుంటుంది. ఇక్కడ హాజీలు పరమభక్తితో మెలుగుతారు. మసీదులో అడుగుపెడితే ఎనలేని ప్రశాంతత చోటు చేసుకుంటుంది. ఈ మసీదులో ఎల్లవేళల్లో అల్లాహ్ ధ్యానం జరుగుతుంటుంది. ఒక పూటకు లక్షమంది అయినా నమాజు చేసే అవకాశం ఉంటుంది. ఇక్కడ ప్రతిరోజూ ఉపవాస దీక్షలు పాటించటం గమనించదగ్గ విషయం.

ఎస్.రహంతుల్లా,
స్టాఫ్ రిపోర్టర్

### నబీ సమాధి దర్శనం:

మసీదులో ప్రార్థనలు చేసే వారు పక్కను ఉన్న మ.సొ.సొ. సమాధిని దర్శించుకుంటారు. ఇక్కడ అంగవికలాంగులకు ప్రత్యేక దర్శనం అవకాశం ఉంటుంది. ఇక భక్తి శ్రద్ధలతో నబీకి సలాం చేస్తారు. నేటికి నబీ(మ.సొ.సొ) సజీవంగానే సమాధిలో ఉన్నట్లు చెబుతారు. ఇక్కడ పెద్ద పెద్ద మీనార్లు మూడు కనబడతాయి. ఇక్కడ హాజీలు ఎంతో భక్తితో దీన



వదనాలతో ప్రార్థిస్తారు. పక్కనే మరో ఇద్దరు ప్రవక్తలు అబూబకర్ సిద్ధిఖ్, హజ్రత్ ఉమర్ సమాధులు కూడా వుంటాయి. ఒక సమాధి ఖాళీగా దర్శనమిస్తుంది.

**ప్రాముఖ్యత:**

మదీనా నగరం బహుముఖ ప్రాముఖ్యతను కలిగి వుంటుంది. మహమ్మద్ ప్రవక్త జీవనకాలంలో ప్రవక్తనగరంగా పేరు వచ్చింది. మస్జిద్ నబవి ప్రవక్త యొక్క సమాధి ఆయన ఇంటిలోనే ఉండేది. ఉమయత్ ఖలీఫ్ అల్ వలీద్ కాలంలో మసీదును విస్తరించబడి మసీదులోపలే ఉంది. 622లో మహమ్మద్ ప్రవక్త మక్కా నుంచి వలస వాసులతో కలసి మదీనా చేరారు. మక్కాలో కొందరు ఇస్లాం మతం స్వీకరించిన కారణంగా బహిష్కరించబడి మదీనా చేరారు.ఇక్కడ మహమ్మద్ సొల్లె అలా సొల్లంను అన్సార్‌గా పిలిచే (మత గురువు) వారు.

**మస్‌జిదే ఖుబా:**

మదీనా నగరంలో మహమ్మద్ ప్రవక్త స్థిరపడి ఉండగా ఇక్కడ మొదటి మస్‌జిద్‌ను 'ఖుబా'ను నిర్మించినట్లు చెబుతారు. ఈ మసీదు 850లో పిడుగుపాటుకు గురై కొంత ధ్వంసమైనట్లు చెబుతారు. 1487లో ఈజిప్ట్ పాలకులు ఖైద్‌బే కాలంలో పునర్నిర్మాణం మదీనా దేశంలో ముస్లిమేతరులకు ప్రవేశం నిషేధించబడింది.

**యుద్ధాలు జరిగినవన్ని మదీనాలోనే . ..**

ఇస్లాం మత వ్యాప్తి దాని కోసం యుద్ధాలు అన్ని మదీనా పరిసరాల్లోనే చోటు చేసుకున్నాయి. ఇస్లాం మత వ్యాప్తి కోసం జరిగిన మొదటి యుద్ధం మదీనాకు సమీపంలోని బదర్ మైదానంలో జరిగింది. 623 జనవరిలో ఉబైదాఇబ్‌ని హారిస్ నాయకత్వంలో మహమ్మద్ ప్రవక్త ఆదేశాలతో శత్రువులపై సమరభేరికి సమాలోచనలు జరిగాయి. నేటికి ఆ మైదానంను ముస్లింలు దర్శించుకుంటారు. ఈ యుద్ధంలో మృతిచెందిన ప్రవక్తల సమాధులు ఇక్కడ దర్శనమిస్తాయి. ఇస్లాం కోసం అగ్ని బాణాలను వదలిన మొదటి వీరుడు 'ఉబైదా'. అబుసూఫియా యుద్ధతాకిడిని తట్టుకోలేక మక్కా వాసులు ఒడంబడికను చేసుకున్నారు. బదర్ యుద్ధంలో ఉబైదా మృతి చెందారు. మదీనాను మహమ్మద్ ప్రవక్త స్వాధీనం చేసుకున్న తరువాత ప్రాధాన్యత పెరిగింది.

## 20శతాబ్దంలో ఆక్రమణలు:

20శతాబ్దంలో 2వ ప్రపంచ యుద్ధం జరిగింది. ఈ సందర్భంగా మదీనా నగరం కూడా ఆక్రమణలకు గురైంది. నేడు పాలకులు ఈ దివ్యనగరాన్ని ఓ వైపు ఆధ్మాత్మిక నిలయంగాను, మహానగరంగా తీర్చి దిద్దుటకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

**దర్శనీయ స్థానాలు:**

మదీనా పరిసరాల్లో మరో మహానగరం జద్దా. ఇక్కడే అంతర్జాతీయ విమానాశ్రమం ఉంది. హజ్,ఉమరాకు వెళ్లే వారు జద్దాలోని విమానాశ్రయం నుంచే ఇటు మదీనా అటు మక్కాకు వెళతారు. ఇక్కడ పలు ప్రాముఖ్యం కల్గిన మసీదులు, ప్రాంతాలున్నాయి. ఈ నేపథ్యంలో బిలాల్‌మస్‌జిద్, ఖైఫ్‌మస్‌జిద్, ఖిబ్లతైన్, వాదియే జిన్, ఖందఖ్, వహాద్, ఉహాద్‌కా పహాడ్, బబ్లేమలాయక, దివ్యఖుర్ ఆన్ ముద్రణ ప్రెస్




ఇక్కడే ఉంది. ఇలాంటి ధార్మిక నిలయాన్ని ప్రతి ముస్లిం ఒక్కసారి అయినా దర్శించుకోవటం ఎంతో అవసరం.

**ఉమ్రాకు పెరిగిన ప్రాధాన్యత**

ముస్లింలు పవిత్రంగా భావించే ఆధ్యాత్మిక, ధార్మిక నిలయాలు మక్కా, మదీనా. అరబ్బి దేశంలో గల ఈ రెండు దివ్య క్షేత్రాల దర్శనకు ఇటీవల ప్రపంచ దేశాల నుంచి భక్తి భావంతో పరుగులు తీస్తున్నారు. భక్తి ప్రవృత్తులతో మోకరిల్లి తాము తెలిసి, తెలియక పగటి వెలుగులో, రాత్రి చీకటిలో చేసిన తప్పులను క్షమించమని అల్లాహ్‌ను కన్నీరు మున్నీరుగా వేడుకుంటున్నారు. గతంలో అర్హత, ఆర్థిక స్థోమత కలిగిన వారు బక్రీదు మాసంలో హజ్ చేసి హాజీలయ్యేవారు. కరోనా తరువాత ఉమ్రాకు ప్రాధ్యానత పెరిగింది. నిత్యం రెండు దివ్యక్షేత్రాలకు ప్రపంచ నలుమూలల నుండి లక్షలాది మంది తరలివస్తుంటారు.

**హజ్‌కు ఉమ్రాకు తేడాలు:**

ముస్లింలు అతి పవిత్రంగా భావిస్తూ మోకరిల్లే దివ్యక్షేత్రం మక్కా మదీనాకు ఆర్థిక స్థోమత అర్హత వుండే వారు ముస్లింలు ఆచరించాల్సిన ఐదు సూత్రాల్లో "హజ్" ఒకటి. హజ్ అంటే 42 రోజులు. బక్రీద్ సందర్భంగా ఐదు రోజులు ఎంతో ప్రాధాన్యత కల్గి వుంటాయి. ఇది ఏడాదిలో ఒకేసారి వస్తుంది. "ఉమ్రా" అంటే ఏడాది 11 నెలల్లో ఎప్పుడైనా వెళ్ళవచ్చు. హజ్‌చేయాలంటే ప్రస్తుతం ప్రభుత్వం తరపున వెళ్ళాలంటే కనీసం రూ. ఒక లక్ష కావాలి. అదే ప్రైవేటుగా వెళ్ళాలంటే కనీసం రూ. ఐదులక్షలు సరిపోతుంది. హజ్‌కు 15-18 రోజులు సరిపోతుంది. ఏడుసార్లు "ఉమ్రా" చేస్తే "ఒక హజ్" పుణ్యం వస్తుందని నమ్మకం. పూర్వం రవాణాసౌకర్యాలు లేని రోజుల్లో హజ్‌యాత్రకు వెళ్ళేవారు సముద్రయానం చేసేవారు. సుమారు 3 నెలలపాటు ఓడల్లో పయనించేవారు. మారుతున్న నేటి పరిస్థితుల్లో ఆకాశయానం సులభతరంగా మారింది. నాడు హజ్ యాత్రకు వెళ్ళేవారు చనిపోతే "కఫన్" కూడా సిద్ధం చేసుకొనే వెళ్ళే వారు. ఒకవేళ ప్రయాణంలో మృతి చెందితే సిద్ధంచేసి సముద్రంలో ఖననం చేసేవారు.



**మక్కా ప్రాధాన్యం:**

అల్లాహ్ భూమిని మొట్టమొదటి సృష్టించినది "మక్కా దివ్యక్షేత్రం" అని ప్రశస్తి. దీనిని "అల్లాహ్ కాఫుర్"

**(మిగతా 19వ పేజీలో)**



కథ

# చీకట్లో వంటవాడు

ఆరోజు ఆదివారం కావడంతో పిల్లలంతా పెద్దమ్మ చుట్టూ చేరారు. 'ఇవాళ మీకు ఒక మంచి కథ చెప్తాను' అంది పెద్దమ్మ.
'మాకు కథ కాని కథ చెప్పు పెద్దమ్మా' అని గోముగా అడిగాడు రుద్ర.
'అంటే ఏమిటిరా?' అని దీర్ఘం తీస్తూ అడిగింది పెద్దమ్మ.
'మెదడుకి మేత లాంటి కథ' అని జవాబిచ్చాడు రుద్ర. 'సరే'నని చెప్పడం ప్రారంభించింది పెద్దమ్మ.
'చామలాపల్లి అగ్రహారంలో విక్రమ అనే తెలుగు మాష్టారు ఉండేవారు. అతను తెలుగు భాషాభిమాని. అతని భార్య పేరు ఈశ్వరి. కొడుకు పేరు ఆనంద్, కూతురు పేరు అక్షయ. అతని భాషాభిమానానికి తగ్గట్టుగానే అల్లుడి పేరు విశ్వ. కోడలి పేరు చిత్రభామ. మనవలకి జయ, విజయ అని తెలుగు సంవత్సరాల పేర్లే పెట్టారు. అతనికి మతిమరపు ఎక్కువ. ఏ విషయం గుర్తు ఉండదు. అందుకని ప్రతీ విషయాన్ని దినచర్య పుస్తకంలో రాసుకునేవారు. కొద్దిరోజుల తర్వాత కుటుంబమంతా కలిసి కాశికి వెళ్లాలి అనుకున్నారు. అందుకు అవసరమైన సామాన్లు అన్నీ ఇనుపపెట్టెలో సర్దుకున్నారు. అసలే దొంగల భయం అని ఆ పెట్టెకి అంకెల తాళం వేశారు మాష్టారు. కొద్దిరోజుల తర్వాత పెట్టె తాళం తీయవలసి వచ్చింది. ఏయే అంకెలు వరుసగా పెడితే తాళం కప్ప తెరచుకుంటుందో మాస్టారికి మాత్రమే తెలుసు. ఆయన అంకెలను మర్చిపోయారు. కుటుంబ సభ్యులందరూ ప్రయత్నించారు. కోడలు చిత్రభామకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే మామగారి దినచర్య పుస్తకం తిరగేసింది. ఒక పేజీలో 'తాళం తెరచుకోవాలంటే చీకట్లో వంటవాడు ఉండాలి' అని రాసి ఉంది. ఆలోచించడం మొదలుపెట్టింది కోడలు.
'పిల్లల్లారా! విన్నారు కదా! ఇదే మీ మెదడుకి మేత. తాళం తెరచుకోవాలంటే అవసరమైన సంఖ్యను చెప్పండి?' అని అడిగింది పెద్దమ్మ.
'వంటవాడు చీకట్ల ఉంటే తెరచుకుంటుంది కదా పెద్దమ్మా?' అన్నాడు రుద్ర.
'ఓరేయ్ వేషాలేసావంటే అట్లకాడతో వాత పెడతా' అంది పెద్దమ్మ.
'ఓరేయ్ రుద్రా! కోపం వచ్చిందా? తిట్టానని. ఆలోచిస్తే మెదడుకి చురుకుదనం పెరుగుతుంది. లేకపోతే మొద్దుబారిపోతుంది. నువ్వే కదా మెదడుకి మేత ఇమ్మన్నావు. మరెందుకలా ఉన్నావు?' అని దగ్గరకు తీసుకుని అడిగింది పెద్దమ్మ.
'మరి నేను చిన్నోడిని కదా పెద్ద లెక్క ఎలా చేయగలను?' అన్నాడు రుద్ర.
'ఆలోచిస్తే చిన్నదే..ఇంటికి వెళ్లి ఆలోచించు జవాబు దొరుకుతుంది. రేపు రండి! మిగిలిన కథ చెప్పుకుందాం' అని చెప్పడంతో పిల్లంతా ఇంటికి వెళ్లారు. 'ఎవరైనా ఆ సంఖ్యని చెప్పగలరా?' అని అడిగింది పెద్దమ్మ.
'మా వల్ల కాలేదు' అన్నారు పిల్లలంతా. 'సరే వినండి. మామగారి అభిరుచి తెలిసిన కోడలు ఆ దిశగా ఆలోచించడం మొదలు పెట్టింది. మామగారు తెలుగు భాషాభిమానం. ఇంట్లో అందరి పేర్లు తెలుగు సంవత్సరాలే అనుకుని, 'చీకట్లో వంటవాడు' అని పదేపదే చదివింది. జవాబు దొరికింది. తాళం తీసింది. అందరూ చిత్రభానుని మెచ్చుకున్నారు'.
'సరే పెద్దమ్మా ఇంతకు జవాబు ఏంటో చెప్పలేదు' అన్నాడు వంశీ.
కోడలు ఊహించినట్లుగానే ఆ పేర్లు శార్వరి, నల..సంవత్సరాల పేర్లు..శార్వరీ అంటే చీకటి, నల అంటే నలుడు, వంటవాడు. శార్వరి తెలుగు సంవత్సరాల్లో 34వది నలనామ సంవత్సరం 50వది. తాళం తెరచుకోవడానికి అవసరమైన సంఖ్య 3450. ఇదిరా జవాబు' అని ముగించింది పెద్దమ్మ. 'హమ్మయ్య జవాబు తెలిసింది' అనుకున్నారు పిల్లలంతా.
'నేనూ అదే అనుకున్నాను' అంటూ ఇంటికి పరుగుతీసాడు రుద్ర. వాడి చిలిపి తనానికి మనసులోనే నవ్వుకుంది పెద్దమ్మ.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు






వార్త ఆదివారం

## బాలగేయం

### మండే ఎండలు



ఎండలు బాబోయ్
మండే ఎండలు
దాహం..దాహం
చల్లదనం లేదాయో!
పచ్చని చెట్లు
కరిగిపోతున్నాయ్
చెట్లు లేకపోతే
వర్షాలుండవ్
వర్షాలు లేకపోతే
పంటలుండవ్
పంటలు లేకపోతే
ఆహారం వుండదు
ఆకలితో అలమటించాలి
అందరం నడుం బిగిద్దాం
మొక్కలను నాటుదాం
పచ్చదనాన్ని పెంచుదాం
పాడిపంటలను
కాపాడుకుందాం
కాలుష్యాన్ని తగ్గిద్దాం
దేశాన్ని కాపాడుకుందాం.

– రూతు

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**-కె.శరవణన్,** తిరుత్తణి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వజ్రాలు చీకట్లో మెరుస్తాయి.. ఎందువల్ల?

**జవాబు: శరవణన్!** అన్ని వజ్రాలు చీకట్లో మెరవవు. కొన్నింటికి వున్న ప్రత్యేక లక్షణాల వలన అవి చీకట్లో కూడా కాంతినిస్తాయి. సహజ కాంతిలోని అతి నీలలోహిత కిరణాలను శోషించుకునే వజ్రాలు కొన్ని మాత్రం చీకట్లో మెరుస్తుంటాయి. ఈ లక్షణాన్ని శాస్త్ర పరిభాషలో 'ఫ్లోరోసెన్స్' అంటారు. ఈ వెలుగునిచ్చే కాంతి చాలా వరకు నీలంగా ఉంటుంది. మరికొన్ని వజ్రాలు అతి నీలలోహిత కిరణాలు లేకున్నా కూడా ప్రకాశిస్తుంటాయి. మామూలుగా వజ్రం మెరుపు కొన్ని వందల సంవత్సరాల వరకు ఒకే విధంగా ఉంటుంది. సహజ రీతుల్లో ప్రకృతి పరంగా లభించే వజ్రాలు అతికఠినంగానూ, దృఢంగా ఉంటాయి. మన దేశంలో లభించిన కోహినూర్ వజ్రం ప్రపంచ ప్రసిద్ధి పొందింది.

**-ఎస్.కారుణ్య,** వనపర్తి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఒలింపిక్ పతాకంలోని చిహ్నాల అంతర్గతం ఏమిటి?

**జవాబు: కారుణ్య!** 1913లో తెల్లటి వస్త్రం మీద అయిదు రింగులతో కూడిన ఒలింపిక్ పతాకానికి రూపకల్పన జరిగింది. ఆనాటి నుంచి అంతర్గత సంబంధం వున్న అయిదు రింగుల సర్కిల్‌ను ఒలింపిక్ క్రీడల చిహ్నంగా వాడుతున్నారు. ఈ అయిదు రింగులు ఆసియా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా ఖండాలను సూచిస్తాయి. ప్రపంచ దేశాలలోని వివిధ రంగాల క్రీడాకారుల మధ్య సన్నిహిత సంబంధం ఉండాలనే భావానికి ఈ పతాకం చిహ్నంగా నిలుస్తుంది. ఈ రింగులు బ్లూ, ఎల్లో, బ్లాక్, గ్రీన్, రెడ్ రంగులలో ఉంటాయి.నలుపు ఆఫ్రికాకు, ఎరుపు అమెరికాకు, పసుపుపచ్చ ఆసియాకు, ఆకుపచ్చ ఆస్ట్రేలియాకు, నీలం యూరప్‌కుగుర్తుగా ఉంటాయి.

# అక్షరాల్లో యాపిల్ పాడ్‌కాస్ట్‌లు

**పాడ్‌కాస్ట్‌లు** ఎంత పాపులర్ అవుతున్నాయో చూస్తూనే ఉన్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకునే యాపిల్ సంస్థ పాడ్‌కాస్ట్‌లను మరింత అందుబాటులోకి తేవటానికి, వాటిల్లోని అంశాలను, విషయాలను తేలికగా కనుక్కోవటానికి ఓ వినూత్న ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. దీని పేరు ట్రాన్స్‌క్రిప్ట్స్. పేరుకు తగ్గట్టుగానే ఇది మాటలను అక్షరాల రూపంలోకి మారుస్తుంది. యాపిల్ పాడ్‌కాస్ట్ యాప్‌ల ఒదిగిపోయే ఇది ప్రసార భాగాలను అక్షరాల్లోకి అనువదిస్తుంది. ఆయా పదాలు, పదబంధాలను సెర్చ్ చేసుకోవటానికీ వీలు కల్పిస్తుంది. టెక్స్ట్ మీద తాకితే అక్కడి నుండి పాడ్‌కాస్ట్ ప్లే




అవుతుంది కూడా. ఎపిసోడ్ ప్లే అవుతున్నప్పుడు ప్రతీపదం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. విషయాన్ని తేలికగా గ్రహించటానికి, యూజర్లను అనుసరించటానికి తోడ్పడుతుంది. ఇది కొత్త భాషలను నేర్చుకోవటానికీ ఉపయోగపడుతుంది. బధిరులు, వినికిడి లోపం గలవారికిది ఎంతగానో మేలు చేస్తుంది. ప్రస్తుతానికి ఇంగ్లీష్, ఫ్రెంచి, స్పానిష్, జర్మన్ భాషల్లో ట్రాన్స్‌క్రిప్ట్స్ అందుబాటులో ఉంటుంది. ఐఓఎస్ 17.4, ఐప్యాడ్ 17.4 వర్షన్లతో కూడిన ఐఫోన్, ఐప్యాడ్ యూజర్లు దీన్ని వాడుకోవచ్చు. అయితే ఇది భాషలను అనువాదం చేయదని గుర్తుంచుకోవాలి.

**ఎక్స్ లో ఆర్టికల్స్**

పాత్రికేయులు, రచయితల కోసం ఎక్స్ (ట్విటర్) కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. పెద్ద కథనాలను రాసుకోవటానికి తోడ్పడే దీని పేరు ఆర్టికల్స్, ప్రస్తుతం ఇది ధ్రువీకృత సంస్థలు. ప్రీమియం చందాదారులకు అందుబాటులో ఉంది. ఈ ఫీచర్‌లో ఆర్టికల్ కంపోజర్ సదుపాయమూ ఉంది. దీంతో టెక్స్ట్‌ను బోల్డ్, ఇటాలిక్, స్ట్రైక్‌త్రో శైలిలోకి మార్చుకోవచ్చు. బుల్లెట్ పాయింట్లు, అంకెల జాబితానూ పెట్టుకోవచ్చు. కథనాలను మరింత ఆకట్టుకునేలా చేసుకోవటానికి ఇమేజ్‌లు, వీడియోలు జోడించుకోవచ్చు కూడా. పబ్లిష్ అయిన కథనాలను ఇతర ఎక్స్ పోస్టుల మాదిరిగానే యూజర్ ప్రొఫైల్, ఫాలోయర్స్ టైమ్‌లైన్స్ మీద చూడొచ్చు. కథనం నిడివి 25వేల క్యారెక్టర్లకు పైగా ఉండొచ్చు. ప్రీమియం చందాదారుల పెద్ద పోస్టులకూ ఇప్పుడు ఇదే నియమం వర్తిస్తోంది. ఇతర పోస్టులకు భిన్నమైనవని తేలికగా తెలిసేలా వీటి ఐకన్, లేఅవుట్ కూడా ప్రత్యేకంగా కనిపిస్తుంది. నిజానికి ఇలాన్ మస్క్ అధీనంలోకి రాక ముందు నుంచే ట్విటర్ పెద్ద పోస్టులను ఆరంభించింది. న్యూస్‌లెటర్ రైటర్స్, క్రియేటర్లను ఆకర్షించటానికి నోట్స్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ట్విటర్‌ను పెద్ద పోస్టుల తొలరూపం అదే.

**- విండోస్‌లోనూ ఏఐ ఎరేజ్**



గూగుల్, సామ్‌సంగ్ పరికరాల్లో ఏఐ ఆధారిత ఫొటో ఎరేజర్ గురించి వినే ఉంటారు. వీటి జాబితాల్లోకి ఇప్పుడు విండోస్ పీసీలనూ చేర్చుకోండి. మైక్రోసాఫ్ట్ సంస్థ తాజాగా జనరేటివ్ ఎరేజ్ ఫీచర్‌ను పరిచయం చేసింది. విండోస్ పీసీల్లో బిల్టిన్‌గా ఉండే ఫొటోస్ అప్లికేషన్‌కు ఈ ఫీచర్ తోడవనుంది. ఇది ఫొటోల్లో అనవసర దృశ్యాలను తొలగించుకోవటానికి తోడ్పడుతుంది. దీంతో వెనకాల ఉండే దృశ్యాల వంటి వాటిని సరి చేసుకోవచ్చు. పెద్దపెద్ద వస్తువులను, దృశ్యాలను చెరిపేసినా ఇది సహజమే అనిపించేలా చేయటం దీని ప్రత్యేకత. ఫొటోస్ యాప్‌లోని ఎడిట్ ఇమేజ్ ద్వారా ఎరేజ్ ఆప్షన్‌లోకి వెళ్లి జనరేటివ్ ఎరేజ్‌ను ఎంచుకోవచ్చు. అనంతరం తొలగించుకోవాల్సిన వస్తువులు, భాగం మీద బ్రష్‌ను కదిపితే చాలు. అవి మాయమవుతాయి. చుట్టుపక్కలున్న దృశ్యం అక్కడికి వచ్చి చేరుతుంది. ఇప్పటివరకూ విండోస్ 11కే పరిమితమైన ఫొటోస్ యాప్ ఏఐ ఫీచర్లను తొలిసారిగా విండోస్ 10 పరికరాలకూ అందుబాటులోకి తెచ్చారు. ❑



15వ పేజీ తరువాయి

(దైవసన్నిధానం) అంటారు. దైవ దూతల ద్వారా ప్రవక్త హాజరత్ "ఇబ్రహీం సొ.అ." ఆయన తనయుడు హజ్రత్ ఇస్మాయిల్ జబీఉల్లా ద్వారా నిర్మించారని చెబుతారు. ఇబ్రహీం ఖలీలుల్లాకు అల్లాహ్ నేటి మక్కా స్థలంలో నమాజు చేయవలెనని ఆదేశించినట్లు చెబుతారు. ఇబ్రహీం ఖలీలుల్లా సారధ్యంలో మక్కాలోని తవాఫ్ చేసే ప్రాంతాన్ని "కాబాగిలాఫ్" అంటారు. నిర్మాణానికి పూర్వం "హతీం" వరకు ఉండేది. వివిధ కారణాలతో "కాబాగిలాఫ్" సైజ్ తగ్గించినట్లు సమాచారం. నిర్మాణ సమయం అల్లాహ్ సహాయంగా "జన్నత్" నుంచి (స్వర్గం) ఓ మహిమాన్విత రాయిని పంపారని దానిని "హజరే అశ్వద్" అంటారు." కాబేఖానా" నిర్మాణ సమయంలో ఒక్కొక్కరాయి పెరిగేకొద్ది నిచ్చెనలా సాగేదని చెబుతారు.

**తవాఫ్ ప్రాధాన్యత:**

మనం భక్తి శ్రద్ధలతో 'ఉమ్రా" వెళ్ళినప్పుడు "ఎహ్రాం" ధరించాలని. అంటే తెల్ల పంచె, తెల్లపైగుడ్డ ధరించి కాళ్ళకు పాదరక్షల్లేకుండా కాబేఖానాలో ప్రవేశించాలి. "ఎహ్రాం" ధరించిన వారికే అనుమతిస్తారు. ప్రవేశద్వారాల లోపల అడుగుపెడుతూనే "ఖానేకాబా" కనబడుతుంది. మొదటి చూపుతో "సలాం" సమర్పించి కన్నీరు మున్నీరుగా తప్పులను క్షమించమని" కష్టాల కడలి నుండి రక్షించమని వేడుకుంటారు. లోపలకు వెళుతూనే కుడి వైపు నుండి "ఖానేకాబా" చుట్టూప్రదక్షిణలు ప్రారంభిస్తారు. ఏడుసార్లు ప్రదక్షిణలు చేస్తూ, తన కోసం, తన సంతతి, బంధువులు, జగత్తులోని మహమ్మద్ సొల్లె అలాసొల్లం సంతతి కోసం ప్రార్థనలు మంత్రాలు చదువుతూ ప్రదక్షిణలు చేస్తూ "గ్రీన్‌లైట్" వద్ద "ఖానేకాబా" వైపుకుడి భాగం (గుండె)ను చూపుతూ సలాం చేస్తారు.

**సఫా, మర్వాసాయి:**

ఖానే కాబా "తవాఫ్" తరువాత "సఫా మారువాసాయి" ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. నాడుదేవుని పరీక్షలో ఇబ్రహీం ఖలీలుల్లా సతీమణి, ఇబ్రహీం ఖలీలుల్లా తల్లి హాజిరా నీటి



కోసంసఫా, మరువా కొండల్లో పరుగులు తీసిన ఉదంతంను గుర్తు చేసుకుంటూ ఏడు ప్రదక్షిణలు చేస్తారు. ఇలా ఇక్కడ భక్తి భావంతో ప్రపంచాన్ని మరిచి అల్లాహ్ ధ్యానంలో తన్మయత్వం చెందుతారు.

**దర్శనీయ స్థలాలు:**

ఆధ్యాత్మిక చింతనకు ఇస్లాం మతవ్యాప్తికి దారి చూపిన అంశాల ప్రాధాన్యత కలిగిన పలు దర్శనీయ స్థలాలను తిలకించవచ్చు.

**తాయిఫ్:**

మక్కాకు సమీపంలోని ఆధ్యాత్మిక నగం తాయిఫ్. మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతవ్యాప్తికి అల్లాహ్ ఆదేశాలను అమలు చేయటానికి మక్కాలో ప్రయత్నించగా మక్కావాసులు అనుమతించలేదు. అప్పుడు మహమ్మద్ సొ.అ. తమ బంధువులు నివాసముండు తాయిఫ్‌లో తలదాచుకోవడానికి వెళ్ళగా 3 రోజులు తరువాత అక్కడ కూడా మ.సొ.అ.లకు చేదు అనుభవం ఎదురైంది. ఈ ప్రాంతానికి చెందిన పెద్దలు పిన్నలచేత మ.సొ.సొను రాళ్ళతో కొట్టి శరీరం రక్తసితం చేసినట్లు గ్రంధాల్లో పేర్కొనబడింది. పాదరక్షల్లో రక్తం చేరటంతో బాధా తప్త హృదయంతో దీనంగా అల్లాహ్‌ను ఆరాధిస్తుండగా



దూతలు వచ్చి మీరు ఆదేశించండి రెండు కొండలను కలిపేసి ఇక్కడ జనాన్ని అంతం చేస్తామనగా మహమ్మద్ ప్రవక్త నేను సమాజంలో మార్పు, శాంతి, ఇస్లాంను ప్రచారం చేయటానికి వచ్చినాను. తరువాత ఆయన ప్రయత్నానికి ఫలితం వచ్చింది. హిందూస్తాన్‌లో మహమ్మద్ ఇబ్నే ఖాసీం ద్వారా రాజరికంగా గుర్తింపు లభించింది. ఉమ్రాకు వెళ్లే వారు ఇక్కడ ఎహ్రాం ధరించటం జరుగుతుంది. ఈ ప్రాంతం నుంచే ఇస్లాం మతం ప్రచారం ప్రారంభం అయ్యిందని చెబుతారు.

**మీఖాతే ఖననల్ మహాసీన్:**

మక్కాలో ఉమ్రాకు వెళ్ళిన వారు దర్శించుకునే మరో ప్రాంతం 'మీఖాతే ఖననల్ మహాసీన్ ఉమ్మత్.సౌదీలోని ప్రధాన నగరాల్లో ఇది ఒకటి ఒకసారి మ.సొ.సొం ఉమ్రా చేయాలనుకున్నపుడు ఈ మస్జిద్‌లో ఎహ్రాం కట్టుకున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. సౌదీ అరేబియా నుంచి రోడ్డు మార్గంలో మక్కా వెళ్లి సౌదీ అరేబియా, కువైట్, దుబాయ్ నుంచి ఉమరాకు వచ్చేవారు. ఇక్కడ ఎహ్రాం ధరించటం ఆనవాయితి.

**మస్జిదే ఆయిషా:**

ఒకసారి మ. సొ. సొ మరియు ఆయన సతీమణి ఆయిషాలు ఉమరా చేయటానికి వచ్చారు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత నెలసరి సమస్యతో ఆయిషా ఉమ్రా చేయలేక పోయారు. అయితే మ.సొ.సొ మాత్రం ఉమ్రా చేసి తిరుగు పయనమౌతుండగా అయిషా దీన వదనంతో తాను సమస్యతో ఉమ్రా చేయలేక పోయాను ఇప్పుడు సమస్య తీరింది కదా అని చెప్పగా మ.సొ.సొ ఈ మస్జిద్‌లో ఎహ్రాం ధరించమని చెబుతారు. మూడు రోజులు అయిషా ఈ ప్రాంతంలో ఉన్నారు కాబట్టి ఈ మస్జిద్‌కు అయిషా మస్జిద్ అని పేరు వచ్చింది.

ఇవికాక మఖాతేఖననల్ మహాసిన్ ఉమ్మత్, జిద్దా, సులేహుదేబియా, జహిరాన, అరాఖాత్, ముస్దలిఫా, మీనా, జమరాత్, జబ్లే రహమా, గారేహిదా ఇలా ఎన్నో దర్శనీయ మస్జిద్‌ల నిలయంగా మక్కా విరాలిజుల్లుతుంది.

కథ

"నితిన్! తొందరగా తీసుకెళ్లండి.. రైలు మిస్ అవుతుందేమో! ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఎందుకు కారును నత్తనడకలాగా నడుపుతున్నారు? ఇలా అయితే నాకు రైలు అందదు" కంగారుగా అన్నది సాధన.

"సాధనా! నేను మాత్రమే నిదానంగా వెళ్తున్నానా? అలా చూడు.. మన కారు ముందు, వెనుక కూడా చూడు.. ఎన్ని వాహనాలు ఆగిపోయాయో! ముందు ఏదో అడ్డుగా ఉన్నట్లుంది" అన్నాడు నితిన్.

# నాణేనికి మరోపక్క

**సుమ కైకాల**

కాసేపటి తరువాత కారు కొంచెం పక్క నుండి వెళ్లి కాస్త ముందుకు వెళ్లి మళ్లీ ఆగింది.

"సాధనా! అదుగో.. అక్కడ ఏక్సిడెంట్ అయింది. ఎవరో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. అందుకే ట్రాఫిక్ జామ్ అయింది. పదే పదే హారన్ కొట్టినా ఏ వాహనాన్నీ ముందుకు దాటనివ్వలేదు. అంబులెన్స్ కోసం అందరినీ ఆపేసారు" అన్నాడు నితిన్.

ఆ మాట విన్న వెంటనే సాధన అసహనం అంతా ఎగిరిపోయింది!

"అయ్యో! అనవసరంగా ఎంత కోపం తెచ్చుకున్నాను" స్వగతంలో అంది సాధన.

"సాధనా! మన చుట్టూ ఉన్న వాటిపై మన స్వంత అవగాహనల ఆధారంగా, మనం సృష్టించుకున్న దృష్టి కోణం వల్ల ఒక రకమైన గందరగోళంలో ఉంటాం. అందుకే ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. మనసుతో చూసే దృష్టి కోణాన్ని మనస్సుతోనే విశ్లేషించి సరైన నిర్ణయం తీసుకోవాలి" నిదానంగా అన్నాడు నితిన్.

"అవకాశం దొరికితే చాలు ఏదో పాఠం చెప్పాలని చూస్తారు. నేను ఏమీ వినాలనీ అనుకోవడం లేదు" చిర్రుబుర్రులాడింది సాధన.

"నీకు కోపం వచ్చిందని నాకు తెలుసు. అది నిన్న అమ్మతో క్రెచ్ గురించి చెప్పినప్పటి నుండి ఆవేశపడుతున్నావు. నేను అమ్మ గురించి ఆలోచించి అన్నాను. దాన్ని నువ్వు అపార్థం చేసుకుని అర్థాంతరంగా పుట్టింటికి బయల్దేరావు. నేను ఒక మాట చెప్తాను, వింటావా?" అన్నాడు నితిన్.

"మీరు ఎలాంటి ఉద్దేశంతో అన్నారో తెలియనంత పిచ్చిదాన్ని కాదు. ఇక నాకు పిల్లలు పుట్టరని మీరిద్దరూ నిర్ణయించుకున్నారా?" కోపంగా అన్నది సాధన.

"అయ్యో! నువ్వు అర్థం చేసుకున్న విధానం తప్పు. మనకు పిల్లలు పుట్టరని ఎవరన్నారు? దానికి క్రెచ్ పెట్టడానికి సంబంధం ఉందా? ఎప్పుడూ ఆశ, ఉత్సాహంతో కూడిన సానుకూల ఆలోచన ఉండాలి. అలాంటి దృక్పథంతో ఉంటే వైరాగ్యపు ఎడారి కూడా పచ్చని అడవిలా ఉల్లాసంగా మారుతుంది. అమ్మ సంతోషంగా ఉండాలని ఆ ఆలోచన చేసాను. అది నువ్వు వేరే కోణం నుండి చూస్తున్నావు. స్టేషన్ వచ్చింది.. దిగు" అన్నాడు నితిన్.



అదృష్టవశాత్తూ సికిందరాబాద్ నుండి నర్సాపూర్ వెళ్లే రైలు పట్టాల మీద బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

"మీరు రైలు ఎక్కవద్దు.. రైలు కదిలే సమయమైంది" అతని మాట కోసం ఎదురు చూడకుండా సాధన ఎక్కవలసిన కోచ్ నంబర్ చూసుకొని ఎక్కింది. బర్త్ నంబర్ పద్నాలుగు దగ్గరకు వచ్చి ఆగింది. ఆమె బెర్త్ మీద ఇద్దరు పిల్లలు కూర్చుని ఉన్నారు.

"ఆ బెర్త్ నీదేనా? ఒకసారి చెక్ చేసుకో" కిటికీ దగ్గర నిలబడి అన్నాడు నితిన్.

సాధన ఒకసారి మళ్లీ సీట్ నంబర్ పొరబడ్డానేమోనని ఫోన్లో చూసుకుంది. "సరిగ్గానే ఉంది. పద్నాలుగు నంబర్.. నాదే!" అంటూ ఎదురు బెర్తు వైపు చూసింది.

కళ్లు మూసుకుని రెండు చేతులతో నుదురు పట్టుకుని సుమారు యాభై యేళ్ల యువతి కూర్చుని ఉంది.

తనతో తెచ్చిన సూట్‌కేస్ సీట్ కింద పెట్టి ఆవిడ కళ్లు తెరవాలని చప్పట్లు కొట్టింది సాధన. ఆమె కళ్లు తెరిచి చూసింది.

"ఈ బెర్త్ నాది" అంటూ ఫోన్లో టికెట్ చూపించింది సాధన.

"సరేనమ్మా.. నేను కూర్చున్న బెర్త్, అప్పర్ బెర్త్ కూడా మాదే. ఈ పిల్లలు నా మనవడు, మనవరాలు. నువ్వు పడుకునే సమయంలో బెర్త్ వాల్చేదాకా పిల్లలు అటు, ఇటూ ఆడుకుంటారు. నువ్వు డిన్నర్ చేసేవరకు పిల్లలను కూర్చోనివ్వమ్మా" అందావిడ.

"సాధనా! పిల్లలే కదా కూర్చోనివ్వు. మరో మాట విను.. నీకు పుట్టింట్లో ఉండాలనిపించినన్ని రోజులు హాయిగా ఉండి రా. బండి కదులుతోంది. దిగాక ఫోన్ చెయ్యి" అని కూల్‌గా అన్నాడు నితిన్.

తన కోపాన్ని అర్థం చేసుకోని అతని మాటలకు చిరాకు వచ్చింది సాధనకు. సమాధానం చెప్పకుండా తల తిప్పుకుంది. కిటికీ దగ్గర కూర్చున్న పిల్లలను పక్కకు జరగమని తను కూర్చుంది.

చుక్ చుక్ మంటూ రైలు అక్కడ నుండి కదిలిపోయింది.

“ఆంటీ! కొంచెం జరగండి, నేను కిటికీ దగ్గర కూర్చుంటాను” అన్న మాటలు వినిపించి తల తిప్పి చూసింది సాధన.

ఐదు సంవత్సరాల పాప నిలబడి ఉంది. జుట్టు సరిగ్గా దువ్వలేదు, గౌను కూడా కొంచెం నలిగిపోయి ఉంది. నుదుటి మీద ఉండాల్సిన చోటులో బొట్టు లేదు, కాస్త వంకరగా పక్కకు జరిగి ఉంది. ఆ పాప పక్కనే కాస్త చిన్నగా ఉన్న అబ్బాయి నిలబడున్నాడు. ఆ అబ్బాయి బట్టలు కూడా నలిగిపోయి ఉన్నాయి. జుట్టు దువ్వకుండా వదిలేయడంతో నుదుటి మీద కళ్లను కప్పుతూ ఉంది.

సాధనకు వాళ్లను చూస్తే పలకరించాలనిపించలేదు.

“ఆంటీ! మీరు ఇటు జరగండి, నేను అక్కడ కూర్చుంటాను” మళ్లీ అన్నది పాప.

“ఊహూ! నువ్వు కాదు నేను కూర్చుంటాను” అన్నాడు బాబు.

“ఆంటీని ముందు అడిగింది నేను.. నేనే కూర్చుంటాను” ఒక తోపు తోసింది పాప.

బాబు వచ్చి సాధన మీద పడ్డాడు. వెంటనే సాధన ఆ అబ్బాయిని పైకి నెట్టేసింది. బాబు పడిపోబోయాడు, ఎదురు సీట్ల ఉన్న వాళ్ల అమ్మమ్మ పడకుండా పట్టుకుంది.

“అమ్మమ్మా! అక్క నన్ను తోసేసింది” ఏడుస్తూ అన్నాడు బాబు.

“అమ్మమ్మా! కిటికీ దగ్గర సీట్లో నేను కూర్చుంటానంటే వినడం లేదు. నేను కూర్చుంటానంటున్నాడు” అన్నది పాప.

“అల్లరి చేయకుండా ఆడుకోండి” మెల్లిగా అందావిడ.

“మీరు లేవండి ఆంటీ!” వదలకుండా అంది పాప.

సాధనకి అసలే చిరాకుగా ఉంది.. ఆ పాప సీటు అడగటం ఇంకా విసుగు కలిగించింది. సమాధానం ఇవ్వకుండా కిటికీలో నుండి బయటకు చూస్తుంది.

“రైల్వే స్టేషన్‌కి దగ్గరలో ఉన్న హోటల్‌లో టిఫిన్ తీసుకోవాలనుకుంటే దారిలో ఆ కారు వల్ల ఆలస్యమయింది. ఇప్పుడు టిఫిన్ రైల్వే క్యాంటీన్‌లో ఆర్డర్ చేయాలి” అనుకుంది సాధన.

ఇద్దరు పిల్లలు అటు ఇటు పరుగెడుతున్నారు. ఒకరితో ఒకరు పోట్లాడుకుంటున్నారు, ఒక్కోసారి సీట్ల పైన ఎక్కి గెంతుతున్నారు. అసలు ఆవిడ మాత్రం వాళ్లను పట్టించుకోవడం లేదు. ఫోన్లో ఏదో చూసుకుంటోంది.

ఆ పిల్ల మళ్లీ సాధన దగ్గరకు వచ్చింది.


“ఆంటీ! మీరు అక్కడి నుండి లేస్తారా?” ఈసారి దూరంగా నిలబడి అడిగింది.

“లేవను..” ఖరాఖండిగా చెప్పేసింది సాధన. “ఎందుకు లేవరు? పిల్లలు అడిగితే ఏదయినా చేస్తారని మా అమ్మ చెప్పింది” అన్నాడు బాబు.

“ఇది నా సీటు.. అది మీ సీటు. మీరు ఇక్కడ కూర్చోకూడదు” పంతంగా అన్నది సాధన.

“అయితే ఇటు జరిగి కూర్చోండి.. కిటికీ దగ్గర కూర్చుంటే మాకు మా అమ్మ కనబడుతుంది” అన్నది పాప.

పాప వాళ్ల అమ్మమ్మ అలా ఎదిరించి మాట్లాడవద్దని వారించడం లేదు. ఏదో లోకంలో ఉంది. అసలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. అది సాధనకు కోపం తెప్పిస్తోంది.




పిల్లలకు తెలియకపోయినా పెద్దావిడకయినా తెలియాలి కదా అని లోలోపల తిట్టుకుంది.

రైల్వే సర్వర్లు మీల్స్, టిఫిన్స్ తీసుకుని వచ్చారు. ఆవిడ రెండు ప్లేట్ల ఇడ్లీ తీసుకుంది. సాధన కూడా ఒక ప్లేటు ఇడ్లీ తీసుకుంది.

“అమ్మమ్మా, చట్నీ కారంగా ఉంది, నెయ్యి వెయ్యి” అంది పాప.

“ఇక్కడ నెయ్యి ఉండదు తల్లీ! ఇలాగే తినాలి” అని ఇడ్లీముక్క తక్కువ చట్నీ అద్ది పెడుతోంది.

“ఊహూ.. నాకు వద్దు” అని చిరాకుగా ఊసేసింది పాప.

“ఆంటీ! మీరు అక్కడి నుండి లేస్తారా?” పాప ఈసారి దూరంగా నిలబడి అడిగింది.
“లేవను..” ఖరాఖండిగా చెప్పేసింది సాధన.
“ఎందుకు లేవరు? పిల్లలు అడిగితే ఏదయినా చేస్తారని మా అమ్మ చెప్పింది” అన్నాడు బాబు.

“నాకు సాంబారుతో పెట్టు” అన్నాడు బాబు.

ఆవిడ “అలాగే నాన్నా!” అంటూ ఓపికగా సాంబారుతో ఒక్కో ముక్క పెడుతోంది.

“ఛీ.. బాలేదు అమ్మమ్మా! మా అమ్మ బాగా చేస్తుంది” అన్నాడు బాబు.

“అలా పేచీ పెడితే బొజ్జ నిండదు. మా అమ్మ కదూ! మా బాబు కదూ!” అంటూ ఇద్దరికీ తినిపించిందావిడ. కానీ ఆవిడేమీ తినలేదు. అక్కడంతా ఇడ్లీ, సాంబారు మరకలు పడ్డాయి. సీటు మీద కూడా పడింది.

సాధనకు అదంతా అపరిశుభ్రంగా అనిపించి ఇడ్లీ కూడా తినబుద్ధి కాలేదు. నిన్నటి నుండి అత్తగారి మీద, భర్త మీద కోపంతో ఆహారం సరిగా తినలేదు. ఇప్పుడు ఈ పిల్లల అల్లరి చూస్తుంటే విసుగుతో తినాలనిపించడం లేదు. కానీ ఆకలి వేస్తోంది, కిటికీలో నుండి బయటకు చూస్తూ గబ గబ నోట్ల కుక్కేసుకుంది. లేచి బయటకు వెళ్లి వాష్ బేసిన్ దగ్గర చెయ్యి కడుక్కుని వచ్చి కూర్చుంది.

ఆవిడ పిల్లలకు వాష్ బేసిన్ వైపు తీసుకువెళ్లి వాళ్ల చేతులు, మూతి కడిగి బ్యాగ్‌లోంచి టవల్ తీసి తుడిచింది. తరువాత ఒక టిష్యూ పేపర్ తీసుకుని సీట్ మీద శుభ్రంగా తుడిచింది.

"ఇక నేను పడుకుంటాను" ఆవిడతో అన్నది సాధన.

"సరేనమ్మా!" అని తల ఊపింది.

సాధన బెర్తు మీద దుప్పటి వేసుకుని పడుకుంది. పిల్లలకు మళ్లీ కూర్చునే అవకాశం ఇవ్వకుండా.

సాధన పై బెర్తు మీదకు ప్రయాణికులు వచ్చేసారు. పిల్లలు పడుకోకుండా కింద సీటులో కూర్చోవడం వల్ల ఆవిడ అప్పర్ బెర్త్ వేసుకోకుండా కూర్చోనుంది. పిల్లలు పడుకోవడానికి చాలా పేచీ పెడుతున్నారు.

సాధనకు నిద్ర రావడం లేదు. నిన్న ఉదయం జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది.

............

సాధన, నితిన్‌లకు వివాహం జరిగి ఐదేళ్లయింది. నితిన్ తండ్రి రామారావు పెళ్లికి ఏడాది ముందే హార్ట్ ఎటాక్ వచ్చి కాలం చేసాడు. తల్లి సుశీల సౌమ్య స్వభావం గలది. వారిద్దరూ అన్యోన్యంగా అన్యోన్య దంపతులు. భర్త మరణం ఆమెను కుంగదీసింది. నితిన్ ఒక్కడే వారి ప్రేమ ఫలం.

"నితిన్! అమ్మ పరిస్థితి చూడు.. నువ్వు పెళ్లి చేసుకుంటే కోడలు ఇంట్లో తిరుగుతుంటే కాస్త సందడిగా ఉంటుంది. మనవడో, మనవరాలో ఇంట్లో పారాడుతుంటే అమ్మ త్వరలో మామూలు మనిషవుతుంది" అని బంధువులందరూ చెప్పారు.

దానితో నితిన్ ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లికి సుముఖత చూపించాడు. పెళ్లిళ్ల పేరయ్య తెచ్చిన సంబంధాలలో సాధన ఫొటో నితిన్‌కి బాగా నచ్చింది. సుశీల కూడా పెళ్లికి అంగీకారం తెలిపింది. సాధన ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాల వేటలో ఉంది. పెళ్లిచూపులు జరిగాయి. ఇరు పక్షాలు పరస్పరం ఇష్టపడ్డారు.

"కట్నకానుకలేమీ వద్దు! అమ్మాయి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. తనకు ఉద్యోగం చేయడం ఇష్టమైతే మాకు అభ్యంతరం లేదు. మా ఇంట్లో ఒకరుగా కలిసిపోతే చాలు" అన్నది సుశీల.



ఆ మాటలకు అందరూ సాధన అదృష్టానికి పొంగిపోయారు.

"సాధనా! మనం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించనవసరం లేదు. మా అమ్మ తిరిగి మామూలు మనిషి కావాలంటే పసిపిల్లల వల్లే సాధ్యమవుతుంది. ఇది నా అభ్యర్ధన అనుకో" మొదటి రాత్రి భార్యతో అన్నాడు నితిన్.

"సరే! మీ ఇష్టమే నా ఇష్టం" అన్నది సాధన.

సాధన ఇంట్లో కలిసిపోయింది అనడం కన్నా ఆ ఇంట్లో ఆమెకు ఎదురు లేదు. ఎవరూ ఏ విషయంలోనూ అభ్యంతరం పెట్టరు. ఆమెకు ఆడుతూ పాడుతూ రోజులు గడుస్తున్నాయి.

"పెళ్లయి రెండేళ్లయింది.. ఇంకా నువ్వు నెల తప్పలేదు. మీరేమైనా ఇప్పుడే పిల్లలు వద్దనుకున్నారా?" కోడలితో అన్నది సుశీల.

"లేదత్తయ్యగారూ! అలాంటిదేమీ లేదు" సిగ్గు పడుతూ అంది సాధన.

"అయితే ఒకసారి వెళ్లి డాక్టర్‌ని కలవండి" అన్నది సుశీల.

ఆ సాయంత్రం డాక్టర్ దగ్గరకు వెళ్లారు నితిన్, సాధన. అన్ని రకాల పరీక్షలు, స్కానింగులు చేసిన పిదప "పిసిఓడి ఉండటం వల్ల అండం ఫలదీకరణం చెందడం లేదు. క్రమం తప్పకుండా మందులు వాడాలి" అని డాక్టర్ చెప్పారు.

అప్పటి నుండి మందులు వాడుతూనే ఉంది సాధన. కానీ ఇంకా గర్భం రాలేదు. దీనితో సాధనలో తన గురించి అత్తగారు, నితిన్ ఏమైనా అనుకుంటున్నారేమో.. అనే ఆత్మన్యూనతా భావం చోటు చేసుకుంది. నిన్న ఉదయం నితిన్ వాళ్ల అమ్మతో అన్న మాటలు సాధనకు బాంబు పేల్చినట్లనిపించింది.

"అమ్మా! మన ఇల్లు ఆఫీసులు ఎక్కువగా ఉండే ఏరియాలో ఉంది. చాలా మంది ఆడవాళ్లు ఉద్యోగాలకు వెళ్తూ పిల్లలను క్రెచ్‌లో ఉంచుతున్నారు. మన ఇల్లు పెద్దగా కూడా ఉంది. ఇద్దరు, ముగ్గురు పిల్లలను ఒక ఆయా సహాయంతో చూసుకోగలవా? నీకు పిల్లలతో సంతోషంగా కాలం గడుస్తుంది. నువ్వు ఉద్యోగం చేసినట్లు కూడా అవుతుంది.. ఏమంటావు?" నవ్వుతూ అన్నాడు నితిన్.

"ఊపిరి లేచి వచ్చిందంటాను నితిన్. ఇది నాకు, సాధనకు కూడా మంచి కాలక్షేపమవుతుంది. తను కూడా ఈ మాటలు వింటే ఎగిరి గంతేస్తుంది" అన్నది సుశీల.

కానీ ఈ మాటలు గదిలో ఉన్న సాధన వినగానే తుళ్లిపడింది. తనకు పిల్లలు లేరని వాళ్ల ఎత్తి పొడిచినట్లు అనిపించింది. లోలోపలే తనలో తనే కుమిలిపోయింది.

"సాధనా! నితిన్ మనిద్దరి చేత క్రెచ్ పెట్టిస్తానంటున్నాడు" లోపలకు వచ్చి చెప్పింది సుశీల.

సాధన జవాబు చెప్పకుండా తల అటు ఇటు ఊపింది తెచ్చి పెట్టుకున్న నవ్వుతో.

"నేను రేపు రాత్రికి మా ఇంటికి వెళ్లాలనుకుంటున్నాను. తత్కాల్‌లో టికెట్స్ బుక్ చేయండి" భర్తతో అన్నది సాధన.

"ఉన్నట్లుండి ఆకస్మిక ప్రయాణం ఏంటి? నువ్వు దేనికో బాధ పడుతున్నట్లనిపిస్తుంది. పిల్లల కోసమే అయితే దిగులు పడకు. దేవుడు మనకు ఇచ్చినప్పుడే తీసుకుందాం. అయినా మన ఇంటినిండా పిల్లలు రాబోతున్నారు" సరదాగా అన్నాడు నితిన్.


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**

**నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త**

**నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

అతడి నవ్వు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది సాధనకు. మాట్లాడకుండా ప్రయాణానికి బట్టలు సర్దుకోవడం మొదలుపెట్టింది.

............

"ఆంటీ! లే... నేను కిటికీ దగ్గర కూర్చుంటాను" తట్టి పిలుస్తోంది పాప.

సాధన ఆ మాటలకు ఆలోచనల నుండి బయటకు వచ్చింది. తనను లేపినందుకు పాప వైపు కోపంగా చూసింది.

"ఆంటీ, తమ్ముడు కొడుతున్నాడు. నేను మీ దగ్గర కూర్చుంటాను" ఆ కోపాన్ని పాప లెక్క చేయకుండా అంది.

సాధన ఆ పాప వాళ్ల అమ్మమ్మ వైపు చూసింది. ఆవిడ దీర్ఘాలోచనలో ఉంది.

"పిల్లలను పట్టించుకోకుండా ఈ పెద్దమనిషి కలలు కంటోందా?" మనసులో తిట్టుకుంది సాధన.

పిల్లలు కొట్టుకుంటూ, ఒకరినొకరు తోసివేసుకుంటూ అరుస్తున్నారు. అక్కడే కూర్చున్న వాళ్ల అమ్మమ్మ తన ఆలోచనల్లో కూరుకుపోయింది. మధ్య మధ్యలో పిల్లలు తన వైపు చూస్తున్నప్పుడు, ప్రేమగా చూస్తూ ఆప్యాయంగా చిరునవ్వు నవ్వుతోంది.

రైలులో ప్రయాణిస్తున్న తోటి ప్రయాణికులందరు కూడా పిల్లల అలరితో విసుగు చెందారు.

"ఇది రాత్రి సమయం.. అందరం విశ్రాంతిగా నిద్ర పోవాలనుకుంటాం. మీ పిల్లలు చాలా అల్లరి చేస్తున్నారు, మీరేమో పట్టించుకోవడం లేదు. కట్టడి కూడా చేయడం లేదు. మీ వైఖరి మాకు నచ్చడం లేదు" ఒక ప్రయాణికుడు అన్నాడు.

"ఏమి మనిషిండీ మీరు? పిల్లలు అంత అల్లరిగా ప్రవర్తిస్తుంటే వాళ్లని ఆపకుండా చిరునవ్వుతో ప్రోత్సహిస్తున్నారు. వారికి వివరించడం

**"నేను ఒక నిజాన్ని ఈ పిల్లలకి ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తున్నాను" కొన్ని క్షణాలు ఆగి అంది ఆ పిల్లల అమ్మమ్మ.**

**"అల్లరి ఆపమని ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తున్నారా? మీ మాటలకు అర్థమేంటి?" చిరాకుగా అన్నది సాధన.**

మీ బాధ్యత కాదా?" కోపంగా అన్నది సాధన.

"హమ్మయ్య! నువ్వు గట్టిగా అరవడం వల్లనైనా ఆ పెద్దావిడ సిగ్గుపడి పిల్లల అలరిని ఆపుతుందేమో అమ్మాయ్..." అన్నాడు ఒక ప్రయాణికుడు.

"నేను ఒక నిజాన్ని ఈ పిల్లలకి ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తున్నాను" కొన్ని క్షణాలు ఆగి అంది ఆ పిల్లల అమ్మమ్మ.

"అల్లరి ఆపమని ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తున్నారా? మీ మాటలకు అర్థమేంటి?" చిరాకుగా అన్నది సాధన.

"నాకు భర్త లేడు, ఒక్కతే కూతురు. ఈ పిల్లలు నా కూతురి పిల్లలు. మా అల్లుడు వ్యాపారంలో నష్టపోయి బాగా అప్పులు చేసాడు. అత్యవసరమైన పని ఉందని పిల్లలను నా దగ్గర వదిలి వాళ్లిద్దరూ హైదరాబాద్ వెళ్లిపోయారు. అప్పుల బాధ తట్టుకోలేక నా కూతురు, అల్లుడు ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలిసి పిల్లలను అక్కడకు తీసుకువెళ్తున్నాను. వారు ఎప్పటికీ వాళ్ల అమ్మను, నాన్నలను చూడలేరనే విషయాన్ని ఎలా వివరించాలా? అని అయోమయంలో ఉన్నాను. ఈ వయసులో నేను వాళ్లకు ఎంతమటుకు న్యాయం చేయగలనో అర్థం కావడం లేదు" కన్నీళ్లతో అన్నది ఆవిడ.

ఇది విని అందరూ అవాక్కయ్యారు. ఎవరూ ఏమీ మాట్లాడలేక స్తబ్ధుగా అయిపోయారు. ప్రయాణికులకు వారిపై అప్పటివరకు ఉన్న కోపం స్థానంలో ప్రేమ, జాలి ఏర్పడ్డాయి.

పిల్లలు ఇంకా తమ అల్లరిలో మునిగిపోయున్నారు. కంపార్ట్‌మెంట్‌లో అటూ ఇటూ పరిగెడుతూనే ఉన్నారు.

ఇప్పుడు ఆ పిల్లలు క్రమశిక్షణ లేని పిల్లల్లా కనిపించడం లేదు. మృదువైన లేతపువ్వుల వలె కనిపిస్తున్న పసివాళ్లను చూస్తే హృదయం ద్రవించిపోతోంది.

ఇప్పుడు ఆవిడ కూడా బాధ్యత లేనిదానిలా కనిపించడం లేదు. కూతురిని, అల్లుడిని పోగొట్టుకుని దీనంగా కనిపిస్తోంది. ఇద్దరు పిల్లలకు తండ్రిగా, తల్లిగా రక్షణ కల్పించే మాతృమూర్తిలాగా కనిపిస్తోంది.

మన ఆలోచనలో మార్పు మన ప్రవర్తనలో మార్పుకు దారి తీస్తుంది. ఒకరి పట్ల మన వైఖరి, అవగాహన ఒక్క క్షణంలో మారిపోతుంది.... పరిస్థితిని బట్టి, అవగాహనలో ఎంత మార్పు!

సాధన మనసంతా మూగపోయింది. కాసేపు మౌనం వహించి కళ్లు మూసుకుంది. తరువాత పిల్లలను పిలిచి తన దగ్గర కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పింది.

"మీరు ధైర్యంగా ఉండాలి. ఇక నుండి పిల్లలకు తల్లి, తండ్రి మీరే! దేవుడు మీకు తప్పకుండా సహాయపడతాడు. మీకు మా సహాయం అవసరమైతే నాకు ఫోన్ చేయండి" అని ఆవిడకి తన ఫోన్ నంబర్ ఇచ్చింది సాధన.

"చాలా సంతోషమమ్మా" అని చేతులు జోడించి అంది ఆవిడ.

సానుకూల దృక్పథంతో చూస్తే మనలోని నెగెటివిటి నశించి సంతృప్తి చోటు చేసుకుంటుంది. అది గ్రహించిన సాధన మనసులో ఉన్న అపార్థం తొలగిపోయింది. ఇప్పుడు అత్తగారు, నితిన్ మాట్లాడిన మాటలలో ఆంతర్యం సరిగ్గా అర్థం చేసుకుంది సాధన. ✦

---

## జోక్స్ కార్నర్

### కూరగాయలు ఇస్తాడని..

సుబ్బారావు తన పొరుగింట్లో వున్న పిసినారి రామారావుతో..

"కూరగాయల షాప్ ఓనర్‌తో చాలా చనువుగా వుంటున్నావెందుకు?"

రామారావు: అతనితో చనువుగా వుంటే కూరగాయలు దొరుకుతాయని.

సుబ్బారావు: అంటే తక్కువ ధరకు కూరగాయలు ఇస్తాడనా?

రామారావు: కాదు... కాదు.. మిగిలిపోయిన కూరగాయలు అంటే ఎండిపోయిన, వాడిపోయిన వాటిని పారేయకుండా నాకు ఇస్తాడు.

### ధర్నాలు చేయరని..!

సుబ్బారావు: నీ కొడుకును పశువుల డాక్టర్ చదివిస్తున్నావు... ఎందుకని?

అప్పారావు: మనిషి కంటే పశువే బెటర్.

సుబ్బారావు: అదెలా?

అప్పారావు: మా వాడి చేతిలో మనిషి మరణించాడనుకుందాం.. అప్పుడు అతని బంధువులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తారు. కానీ పశువు చనిపోతే అలాంటి గొడవలేవీ వుండవు.


**- ఎస్.కె.యాకుబ్ పాషా,**
ఖమ్మం

జయసూర్య

# ప్రజ్ఞానిధి 'వేటూరి ప్రభాకర శాస్త్రి'

**ఆంధ్ర భాషలో కవిత్వం, విమర్శ, పరిశోధన.. ఈ మూడు అంశాలలో అద్వితీయ వాఙ్మయ ప్రతిభా సంపన్నులైన వేటూరి ప్రభాకర శాస్త్రి మహా రచయితగా, ఆంధ్ర భారతికి అపూర్వ సాహితీ సేవలందించిన అత్యుత్తమ పాండితీ భాషాభివర్ధకులు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గురుత్వానుగ్రహ ప్రభావంతో ప్రభాకర శాస్త్రి, ఆంధ్ర వాఙ్మయ సరస్వతిని ఆరాధించారు.**

పరమేశ్వర ప్రీత్యర్థం జీవిత సంకల్పంగా విశిష్ట ఆధ్యాత్మిక అవలోకనంతో వచన, ఖండకావ్య, సంస్కృత అనువాద, చారిత్రక భాషా, పరిశోధక సాహితీ వేత్తగా కీర్తి ప్రతిష్ఠ పొందారు. ప్రాచీన ఆధునిక సారస్వత పాండితీ ప్రజ్ఞా నిధిగా, వారధిగా ఆంధ్ర భాషకు జీవం అందించారు.



ఆంధ్ర వాఙ్మయ సౌధ నిర్మాణం, మదరాసు కేంద్రంగా తెలుగు ప్రవర్ధమానమవుతున్న రోజులలో, వేటూరి వంటి మహాకవులు ఎడతెరిపిలేని భాషా పరిశ్రమతో శ్రమించవలసి వచ్చిన రోజులవి. ఆంగ్ల భాషా ప్రభావం, తమిళ భాషా ప్రాచుర్యం, అచ్చు యంత్ర సౌలభ్యం లేక మట్టిలో కలుస్తున్న తాటి ఆకులు, కరిగిపోతున్న రాగిరేకుల అమూల్య సాహితీ సంపద తెలుగు భాషా సాహితీ ప్రాచీన ఔన్నత్యాన్ని కనుమరుగు చేస్తున్న సమయంలో వేటూరి వైతాళిక బాధ్యత నిర్వర్తించారు. చెన్నపురి ప్రాచ్య లిఖిత సాహితీ పరిశోధకునిగా, ప్రభాకర శాస్త్రి నిరంతర జ్ఞానాన్వేషణ, తెలుగు–తమిళ పండిత లోకాన్ని, ద్రావిడ ప్రకర్షను వెలుగులోకి తెచ్చింది. ఆ పరిశోధనా ఫలితాలు గురించి వినమ్రంగా ఇలా అన్నారు "తమిళం వాడుక భాష తప్ప గ్రాంథికం నాకు పరిచయం కాలేదు.

ఆంగ్లం అసలే అంతంత మాత్రం. ఆంధ్ర వాఙ్మయ సౌధ నిర్మాణంలో ఒకనిగా కొన్నాళ్లు కూలిపని చేసి మట్టిముద్దలు మోసాను. ఈశ్వరానుగ్రహంతో రుణం తీర్చుకొనే ఉపేక్షతో ఉన్నాను" అన్నారు ఒక సందర్భంలో మాతృభాషా విధేయ అవ్యాజ ప్రేమాభిమానిగా.

1888 ఫిబ్రవరి 7న జన్మించి, 1950 ఆగస్టు 20న స్వర్గస్థులైన ప్రభాకర శాస్త్రి, నీతినిధి (వచనం) కడుపుతీపి, కపోత కథ, విశ్వాసం, మూన్నాళ్ల ముచ్చట (నాలుగు ఖండ కావ్యాలు) ప్రతిమా నాటకం, కర్ణభారం, మధ్యమ వ్యాయోగం (మూడూ భాస మహాకవి కృతులకు అనువాదాలు) భగవదజ్జుకం, (బోధాయన కృత ప్రవాసనానికి వాదం) సంస్కృత విద్వత్కవిగా తెలుగు భాషకు ఎనలేని సేవలందించారు. శ్రీనాథుడు, ప్రభాకర శాస్త్రికి నచ్చిన అభిమాన మహాకవి. శృంగార శ్రీనాథంలో శ్రీనాథ మహాకవి కాలం, కృతులు, పద్యాలలోని మెలకువలు, ఎన్నో పాఠాలను అమూల్య పరిశోధనా దృష్టితో వెలుగులోకి తెచ్చారు. క్రీడాభిరామము, హర విలాసం, కాశీఖండం అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రబంధ రత్నావళి, చాటుపద్య మణిమంజరి పరిశోధనల పంట పండించారు.

తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర, కనకాభిషేకం(శ్రీనాథ చరిత్ర) తెలుగు మెఱుగులు, రంగనాథ రామాయణం, గాంధీ రామాయణం వీరి పాండితీ ప్రతిభకు నిదర్శనమైన మణిదీపాలు.

వేటూరి ప్రభాకర శాస్త్రి, తిరుపతి వేంకటేశ్వర సన్నిధి సేవలో భాగంగా తాళ్ళపాక అన్నమయ్య పద సాహిత్యాన్ని ఎన్నో అడ్డంకులు అధిగమించి ఆ సంకీర్తనలను వెలుగులోకి తీసుకురావడం తెలుగు సంగీత, సాహిత్య శ్రీ వేంకటేశ్వర భక్తితత్త్వాన్ని, వైభవాన్ని ప్రపంచ వ్యాప్తం చేసింది. తాళ్ళపాకవారి పద కవితా మాధుర్యం 500 ఏళ్ల తరువాత జగద్విఖ్యాతం కావడం, తెలుగు జానపదానికి వెలుగుగా, తేటదనాన్ని పుక్కిట పట్టిన పదాల సొగసు, సోయగం తొట్టతొలి వాగ్గేయకారునిగా నిక్షిప్తమైన ఆ రాగిరేకులు కరిగిపోకుండా, సంకీర్తనలను ముద్రింపచేసిన, వేటూరి ప్రభాకర శాస్త్రి, కారణజన్ములు.

ఆ సందర్భంలో వేటూరి పలుకులివి "ఇక్కడున్న తాళ్ళపాకవారి సంకీర్తనలు అన్నింటిని స్వాధీనం చేసికొంటిని. ఇట్లెన్నాళ్లకు తాళ్ళపాక మహనీయుల స్వామి సేవాఫలం పరిపక్వమై సహృదయాస్వాద్యమగుచున్నది. అయిదు వందల ఏళ్లకు పిదప




అన్నమాచార్యాదుల అభీప్సితం నెరవేరడం స్వామి అనుగ్రహం".

ఎంతటి ప్రతిభా సంపన్నుడైనా, వేటూరివారు ఆకు మూల పిందెలా అణకువ, నిరాడంబరంగా పాండితీ విద్వత్తు ప్రచారానికి ఆమడ దూరంలో జీవించారు. అందుకే కవిసమ్రాట్ విశ్వనాథ 'త్రిశూలము' పీఠికలో–

**"వేటూరివారి వ్యాఖ్యలు, పీఠికలుం తెలుగుం**
**బొలంతికిన్ బేటులు రేగు గందవొడి వెట్టిన పూతలు!**
**అంతయయ్యు, వా రేటికో పేదతనమే భజయింతురు"**

**అన్నారు.**

వేటూరి ప్రభాకర శాస్త్రి భాషా–సారస్వత పాండిత్య పరిశోధనా రంగంలో అగ్రగణ్యునిగా విద్వత్కవి లోకానికి విజయ వైజయంతిక అంటారు మహాకవి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి. ●

యామిజాల జగదీశ్

# సంపదా.. జ్ఞానమా!

ఈ ప్రపంచంలో మనం బాగుండాలంటే దానికి ముఖ్యంగా కావలసినవి రెండు... ఒకటి సంపద, రెండు జ్ఞానం.

సరే... ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమైనది? అని అడిగితే ఏం చెప్పాలి?

ఈ ప్రశ్ననే హజ్రత్ అలీని అడిగారట. ఆయన ఓ గొప్ప జ్ఞాని. ఆయనను అడిగినవారేమీ సామాన్యులు కారు. వారూ జ్ఞానవంతులే.

ఒకరోజు హజ్రత్ అలీ వద్దకు పది మంది జ్ఞానవంతులు వచ్చారు.

"అయ్యా, మేం పది మంది మీ దగ్గరకు వచ్చింది ఓ ప్రశ్నకు జవాబు అడగడానికే. కానీ మీరు మా పది మందికీ విడివిడిగా జవాబు చెప్పగలరా?" అంటే ఆ పది మంది ఆయన దగ్గర పది రకాల జవాబులు ఆశించారన్నమాట.

హజ్రత్ అలీ "సరే అడగండి.." అన్నారు.

అప్పుడు ఆ పదిమందీ అడిగారు "సంపద-జ్ఞానం.. ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమైనది?" అన్నదే వారి ప్రశ్న.

హజ్రత్ అలీ ఏం చేసారో తెలుసా?

పది మందిలో ఒక్కొక్కరినీ పిలిచారు. ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన జవాబు చెప్పి పంపారు.

మొదటగా ఒకరిని పిలిచి చెప్పారు.

"జ్ఞానమనేది దీర్ఘదర్శులు, జ్ఞానులు, మహాత్ములు తదితరులకు పారంపర్య ఆస్తి. కానీ సంపద ఇతరులకు ఆయుధం. అందువల్ల జ్ఞానమే శ్రేష్ఠమని" చెప్పారు.

రెండో వ్యక్తిని పిలిచారు.

"మీ దగ్గర సంపద వుంటే దానిని మీరే కాపాడుకోవాలి. కానీ జ్ఞానం మిమ్మల్ని ఎప్పుడూ కాపాడుతుంది. కనుక జ్ఞానం శ్రేష్ఠమైనది".

మూడో అతనిని పిలిచి, సంపద ఇతరులకు ఇచ్చేకొద్దీ తరుగుతుంది. కానీ విద్య అంతకంతకు పెరుగుతూ ఉంటుంది. కనుక జ్ఞానమే శ్రేష్ఠమైనది" అని చెప్పారు.

తరువాత ఇంకొకరిని పిలిచి చెప్పారు...

"జ్ఞానమున్న మనిషి ఎప్పుడూ దానిని ఇతరులకు పంచుతూ ఉంటాడు. అందువల్ల అతని మనసు విశాలమైనదిగా ఉంటుంది. కనుక జ్ఞానమే శ్రేష్ఠమైనది" అని చెప్పారు.

మరొకరిని పిలిచి, "సంపదను దొంగలు దోచుకుని పారిపోవచ్చు. కానీ జ్ఞానాన్ని దోచుకోలేరు" అని చెప్పారు.



ఇంకొకరిని పిలిచి "సంపద కాలక్రమేణా తరిగిపోయి నశిస్తుంది. కానీ జ్ఞానం అలా కాదు. కాలం సాగేకొద్దీ జ్ఞానాన్ని ఏమీ చేయలేదు. కనుక శ్రేష్ఠమైనది జ్ఞానమే" అని చెప్పారు.

మరొకరిని పిలిచి "సంపద ఎదలో ఉన్న కాంతిని పోగొడుతుంది. చీకటిని పుట్టిస్తుంది. సువిశాలమైన హృదయాన్ని లేకుండా చేస్తుంది. సంకుచిత మనస్తత్వాన్ని కల్పిస్తుంది. కానీ జ్ఞానం అలా కాదు. అంధకారాన్ని పోగొట్టి హృదయాన్ని తేజోమయం చేస్తుంది. కనుక జ్ఞానమే శ్రేష్ఠమైనది" అని చెప్పారు.

ఇలా ఒక్కొక్కరినీ పిలిచి వారికి జవాబు చెప్తూ వచ్చిన హజ్రత్ అలీ చివరగా ఒకరిని పిలిచి "సంపద మనసులో వికారం పుట్టిస్తుంది. అహంకారాన్ని పుట్టిస్తుంది. దాంతో నేనే దేవుడ్ని అనే స్థాయికి విర్రవీగుతాడు. తోటి వారిని తక్కువ చేసి చూస్తాడు. కానీ జ్ఞానం అలా కాదు. అంధకారాన్ని పోగొట్టి మనసుని నిర్మలం చేస్తుంది. సంస్కారాన్ని ఇస్తుంది. కనుక జ్ఞానమే శ్రేష్ఠమైనది" అని వివరించారు.

ఇలా తనను ప్రశ్నించిన పది మందికీ జవాబులు చెప్పిన హజ్రత్ అలీ "ఇంకేమన్నా అడగదలచుకున్నారా?" అని అడిగారు.

"అడగడానికి ఇంకేమీ లేదు" అన్నారు.

హజ్రత్ అలీ పది మందికి పది రకాల వివరణలు చెప్తూనే సంపద కన్నా జ్ఞానమే శ్రేష్ఠమైనదని స్పష్టం చేశారు.

జ్ఞానం అనేది వాస్తవాలపై అవగాహన, వ్యక్తులు, పరిస్థితులతో పరిచయం లేదా ఆచరణాత్మక నైపుణ్యం, వాస్తవాల పరిజ్ఞానం, ప్రతిపాదిత జ్ఞానం అని కూడా అంటారు. ఇది తరచుగా అభిప్రాయానికి భిన్నంగా ఉండే నిజమైన నమ్మకంగా వర్ణింపబడుతుంది. లేదా సమర్థన ద్వారా అంచనా వేయబడుతుంది. ప్రతిపాదిత జ్ఞానం నిజమైన నమ్మకానికి ప్రతి రూపం అని తత్త్వవేత్తల మధ్య విస్తృత ఒప్పందం వున్నప్పటికీ, అనేక వివాదాలు సమర్థనపై దృష్టి పెడతాయి. విజ్ఞానం తార్కికం సమస్యను పరిష్కరించడం వంటి మన నైపుణ్యాలను పదును పెడుతుంది. జ్ఞానం మెదడు మరింత సాఫీగా ప్రభావవంతంగా పని చేయడానికి సహాయపడుతుంది. జ్ఞానశక్తితో మనం తెలివిగా మారి సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. రోజువారీ జీవితం, రోజువారీ సంఘటనలలో జ్ఞానం ముఖ్యమైనది, ఉపయోగకరంగానూ ఉంటుంది.

అయితే నాకు తెలిసిన ఓ పెద్దమనిషి తనను అడిగిన పది మందికీ ఒకే జవాబు చెప్పి ఎలా ఉందనిపించాడు. ఇంతకూ ఆయనను అడిగిన ప్రశ్న..

"నా దగ్గర తీసుకున్న అప్పుని ఎప్పుడు తీరుస్తావు?" అని పది మంది అడిగారు. అదీనూ పది రకాలుగా. అయితే ఆ పెద్ద మనిషి ఓ తేదీ చెప్పి ఆ రోజున అందరికీ డబ్బులు తిరిగిస్తానన్నాడు.

ఆ మాట చెప్పడంలో ఆశ్చర్యమేమీ లేదండీ. నేను చెప్పిన తేదీ కన్నా ముందర రోజు ఓ విచిత్రం జరగబోతోంది అన్నాడు.

కాస్త విడమరిచి చెప్పు అని అడిగాను.

"మరేమీ కాదండీ.. నేను చెప్పిన తేదీన కదా వారందరూ వస్తారు. అలా వారొచ్చినప్పుడు నేను వారికి పట్టుబడటానికి పిచ్చోడినా.. ఆ తేదీకన్నా ముందర రోజే ఇక్కడి నుంచి అదృశ్యమైపోతానుగా!" అన్నాడు ఏదో ఘనకార్యంలా.

# అరుదైన పర్వతాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని

**యూరప్‌లో** అద్భుతమైన, అరుదైన పర్వతాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటిలో ఒకటి బ్లాంక్ పర్వతం.

## బ్లాంక్ పర్వతం

దీన్ని స్థానికులు మౌంట్ బ్లాంక్ అని పిలుస్తారు. ఇది వాయవ్య ఇటలీలోని ఆల్ప్స్ ప్రాంతంలో ఒస్తానా గ్రామానికి చేరువలో ఉన్న మాన్‌విసో పర్వతాల సమీపంలో ఫ్రాన్స్, ఇటలీ సరిహద్దుల్లో విస్తరించి ఉంది. స్విట్జర్లాండ్‌లోని మార్టిగ్నీ నుండి నైరుతి దిశగా దాదాపు 40 కి.మీ. విస్తరించి ఉంది. దీని ఎత్తు 4,807 మీటర్లు. ఇది పశ్చిమ ఐరోపాలో ఎత్తైన పర్వతం. ఆల్ప్స్ పర్వత శ్రేణిలో ఇది ఎత్తైనది. మౌంట్ బ్లాంక్ అంటే తెల్లని పర్వతం అని అర్థం. నిత్యం మంచుతో కప్పబడి ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. అందుకే ఫ్రాన్స్ వాసులు దీన్ని శ్వేత వర్ణ స్త్రీ అని పిలుచుకుంటారు. దీనికి ఐరోపా పైకప్పు అనే మరో పేరు కూడా ఉంది. ప్రపంచ పర్యాటకులు ఈ పర్వతాన్ని అధిరోహించడానికి ఆసక్తి చూపిస్తుంటారు. ఈ పర్వత చుట్టుపక్కల ప్రకృతి దృశ్యాలు రమణీయంగా ఉంటాయి. మంచు దిబ్బలు, జలపాతాలు, నీటి అఖాతాలు, ఆల్పైన్ తోటలు చూడచక్కగా ఉంటాయి.





బ్లాంక్ పర్వతంపై శీతా కాలంలో మంచు విపరీతంగా కురిసినప్పుడు స్కీయింగ్, స్నోబోర్డింగ్ వంటి క్రీడలు నిర్వహిస్తారు. ఆ కారణంగా ఇది గొప్ప పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రపంచం నలుమూలల నుండి మంచుపై ఆడే క్రీడల పట్ల ఆసక్తి ఉన్న పర్యాటకులు ఇక్కడికి వచ్చి క్రీడలు ఆడి సేద తీరుతీరుతారు. మౌంట్ బ్లాంక్‌కు వాయవ్య దిశగా ఉన్న జలపాతం ఫ్రాన్స్‌లోనే సుందర జలపాతంగా ప్రశంసలందుకుంటోంది. ఈ ప్రాంతంలో చెమొనిక్స్ పేరుతో ఒక విశ్రాంతి భవనం ఉంది. ఇక్కడికి వచ్చిన యాత్రికులు ఇందులో బస చేస్తుంటారు. బ్లాంక్ పర్వతంపైకి కాలినడకన చేరుకోవచ్చు. కాలి నడకన గోటెర్ పేరుగల మార్గంలో శిఖరాన్ని చేరుకోవడానికి రెండు రోజులు పడుతుంది. కాలినడకన ఈ శిఖరాన్ని అధిరోహించడం సాహసమే అవుతుంది. మోటారు వాహనాలపై వెళ్లే సౌకర్యం కూడా ఉంది. హెలీకాప్టర్ నుండి విహంగ వీక్షణం చేసినట్లయితే పర్యాటకులకు అలౌకిక ఆనందం కలుగుతుంది. మౌంట్ బ్లాంక్‌లో సుమారు పన్నెండు కి.మీ. పొడవైన ఒక టన్నెల్‌ను 1957-1965 మధ్య కాలంలో నిర్మించారు. ఈ సొరంగ మార్గం నేడు అన్ని రకాల రవాణాలకు ఉపయోగపడుతోంది.

మౌంట్ బ్లాంక్ ప్రాంతంలో అనేక రకాల ఖనిజాలు, గ్రానైట్ ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. ఇక్కడి హిమానీ నదాలలో మెర్ డి గ్లేస్ ప్రముఖమైనది. ఇది ఆల్ప్స్ పర్వతాలలో రెండవ అతి పొడవైన హిమానీ నదం. 2023లో జరిగిన ఈ పరిశోధనల్లో ఈ పర్వతం ఎత్తు తగ్గిందని తేలింది.

## ఎట్నా పర్వతం

ప్రపంచంలోని పెద్ద అగ్నిపర్వతాల్లో ఒకటి మౌంట్ ఎట్నా. ఇటలీలోని సిసిలీలో మంచుతో కప్పబడిన అగ్నిపర్వతం మౌంట్ ఎట్నా. సిసిలీ ద్వీపంలోని 3,326 మీటర్ల ఎత్తులో ఇది నెలకొని ఉంది. ఎట్నా అనే పదం గ్రీకు భాషలోని ఐథో నుండి వచ్చిందని కొందరి అభిప్రాయం. నేను కాల్చేస్తాను.. అని దీని అర్థం. స్థానికులు మొంగిబెల్లో అని ఈ పర్వతాన్ని పిలుచుకుంటారు. దీని ఎత్తు దాదాపు 11 వేల అడుగులు. సిసిలీ ప్రాంతానికి ఈశాన్య దిశలో ఈ పర్వతం 30 కి.మీ విస్తీర్ణంలో వ్యాపించి వుంది. ఈ అగ్ని పర్వతం విస్ఫోటం చెందిన ప్రతిసారీ దీని ఎత్తు మారుతూ ఉంటుంది. ఈ అగ్ని పర్వతాన్ని 2013లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు.

ఎట్నా పర్వతం ఏటా సగటున 0.55 అంగుళాల చొప్పున మధ్యధరా సముద్రం వైపుకు కదులుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇటలీలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలలో ఒకటి మౌంట్ ఎట్నా. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది పర్యాటకుల్ని దీన్ని సందర్శిస్తుంటారు. ఈ అగ్ని పర్వతంలో ప్రధానంగా అయిదు బిలాలు ఉన్నాయి.


మౌంట్ ఎట్నా తొలి విస్ఫోటం 425లో సంభవించిందని గుర్తించారు. 1669లో సంభవించిన భారీ విస్ఫోటనం కారణంగా 20 వేల మంది చనిపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. 1992లో ఈ అగ్నిపర్వతం బద్దలైంది. 30 సంవత్సరాల తరువాత 2022లో ఇది వరుస విస్ఫోటం చెందింది.



2022లో కూడా ఇది భారీ స్థాయిలో విస్ఫోటం చెందింది. కాటానియా విమానాశ్రయం బూడిదతో నిండిపోవడంతో విమాన సర్వీసులు రద్దు చేశారు. 2023లో కొన్ని గంటల వ్యవధిలోనే 200 సార్లు విస్ఫోటనం జరిగింది. శతాబ్దాలుగా ఉబికి వచ్చిన లావాతో అగ్నిపర్వతం చుట్టూ సారవంతమైన నేల ఏర్పడింది. నిమ్మజాతి ఫలాలు, ద్రాక్షతో పాటు కూరగాయల వరకు అన్నీ ఇక్కడ పండిస్తారు. సిసిలీ జనాభాలో 25 శాతం కంటే ఎక్కువ మంది ఎట్నా పర్వతం వాలులలో నివసిస్తున్నారు. ఆ కారణంగా ఈ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందిన ప్రతిసారి అక్కడి ప్రజలు తీవ్రమైన భయాందోళనకు గురౌతున్నారు. మౌంట్ ఎట్నా అగ్నిపర్వతం మూడు లక్షల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిందని అంచనా వేస్తున్నారు. నిజానికి ఇది జలాంతర్గత అగ్ని పర్వతం. అనేక విస్ఫోటనాలతో ఘనీభవించి ప్రస్తుతం పర్వతం ఏర్పడిందని అమెరికన్ స్పేస్ ఏజెన్సీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## ట్రాన్సిల్వేనియా పర్వత శ్రేణులు

ఈ పర్వతాలు రొమేనియాకి హద్దుగా ఉన్నాయి. యూరప్‌లోని కార్పాతియన్ పర్వతాలలో భాగంగా ఉన్న ఈ పర్వతాలు దాదాపు 1500 కి.మీ. పొడవు కలిగి ఉన్నాయి. కొన్ని చోట్ల 2 వేల ఎత్తు ఉంటే మరికొన్ని చోట్ల ఈ ఎత్తు మారుతూ ఉంటుంది. ఇక్కడి పర్వతాలు పై నుండి కిందకు జారుడు బల్లలా ట్రాన్సిల్వేనియా వైపుకు దిగి ఉంటాయి. ఈ పర్వతాలు ప్రహోవా నదీలోయ నుండి టిమిస్ వరకు వ్యాపించి ఉన్నాయి. వీటిని ట్రాన్సిల్వేనియన్ ఆల్ప్స్ అని కూడా పిలుస్తారు. కార్పాతియన్ పర్వతాలు ఐరోపాలో రెండవ పొడవైన పర్వత శ్రేణిగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో లోయలు, చిన్న చిన్న నీటి ప్రవాహాల సమీపంలో అక్కడక్కడా చెక్కతో నిర్మించిన గృహాలు కనిపిస్తాయి. దక్షిణ ప్రాంతంలోని లోయలో సున్నపు రాయితో నిండి ఉంటుంది. ట్రాన్సిల్వేనియా పర్వత శ్రేణుల్లో 18 కి.మీ పొడవునా సున్నపు దారి ఉంటుంది. ఈ దారి గుండా వెళ్లి లోయలు, గుహలు దాటుకుని వెళితే అతి ఎత్తైన శిఖరం మౌల్టిలియా నోగ పాగరాస్ శిఖరం చేరుకోవచ్చు. ఇక్కడ రిటెజాత్ పేరుతో జాతీయ వనం ప్రసిద్ధి చెందింది. ఇందులో మంచుకొండలు, మంచులోయలు, చిన్న చిన్న అడవులు, నదులు.. ఇలా అనేక సుందర దృశ్యాలు



కనిపిస్తాయి. ఈ ప్రదేశం పైన్ వృక్షాలతో నిండి ఉంటుంది. ఆ కారణంగా తోడేళ్ళ, ఎలుగుబంట్లు, నక్కల సంచారం అధికంగా ఉంటుంది. ఈ లోయల్లో గొర్రెల కాపరులు నివసిస్తుంటారు.

## సున్నపు రాతి పర్వతాలు

ఐరోపాలోని రూగెన్ దీవి ప్రకృతి రమణీయతకు మారు పేరులా కనిపిస్తుంది. ఇది జర్మనీలోని బాల్టిక్ సముద్ర ద్వీపం. జర్మనీలో అత్యధిక జనాభా కలిగిన ద్వీపం ఇది. ఇక్కడ ఆకుపచ్చని బాల్టిక్ సముద్ర తీరం సుందరంగా కనిపిస్తే, సున్నపురాతి పర్వతాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఇవి చూడటానికి సున్నపురాతి అతి పెద్ద కొండలుగా కనిపిస్తాయి. ఇదో పర్వతాల గుట్టగా పరిశోధకులు వర్ణించారు. ఇవన్నీ అతి పెద్ద పీఠభూమిపై నెలకొని ఉన్నాయి. సున్నపురాతి పర్వతాలలో స్టబెన్ కామర్ 117 మీటర్ల ఎత్తైనది. వందల ఏళ్ల క్రితం రూగెన్ దీవిలో ఈ సున్నపురాతి పర్వతాలు వందల మీటర్ల విస్తీర్ణంలో వ్యాపించాయి. సముద్రపు నీటి అలలు తీరాన నెలకొని ఉన్న సున్నపురాతి పర్వతాలను తాకే దృశ్యం నయనానందంగా ఉంటుంది. వేల సంవత్సరాల క్రితం స్టార్‌ఫిష్, ఆల్గే, నత్తలు ఇటువంటివన్నీ ఇక్కడి సముద్రంలో మునగడం వల్ల సున్నపురాతి గుట్టలు ఏర్పడ్డాయి అని చెబుతుంటారు. సముద్రం నీరు ఈ ప్రాంతానికి చాలా దూరంగా జరగడంతో సముద్ర తీరాన సముద్రంలోపు రాతిగుట్టలు ఏర్పడ్డాయని చెబుతుంటారు. మరికొందరైతే సముద్రపు ఆటు, పోటుల వల్ల కూడా ఈ సున్నపురాతి గుట్టలు ఏర్పడ్డాయని చెబుతుంటారు. ఈ ప్రదేశమంతా బాల్టిక్ సముద్ర తీరంలోని జాస్మున్ జాతీయ ఉద్యానవనం కిందకు వస్తుంది. యునెస్కోవారు 2011లో రూగెన్‌లోని జాస్మున్ జాతీయ వనాన్ని ప్రపంచ వారసత్వ పర్వతాలలో ఎగువ భాగాన్ని మాస్ట్రిక్టియన్ అంటారు. ఈ ఎగువ భాగంలో ఎక్కడా లభించనంత నాణ్యంగా సున్నపురాయి ఉంటుంది. ఒకసారి భారీ స్థాయిలో సున్నపురాళ్లు రాలి పడ్డాయి. అటువంటి సందర్భాలలో ఈ ప్రాంతానికి పర్యాటకులు వెళ్లడాన్ని నిషేధించారు. ఇటువంటి విపత్తులు సంభవించడం వల్ల ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతుంటాయి.


ఒక ప్రదేశాన్ని దర్శించి, తిరిగి పదేళ్ల తరువాత వచ్చి చూస్తే ఏదో ఒక మార్పు సంభవిస్తుంది. ఈ సుందర దృశ్యాలను చూడటానికి అనునిత్యం వేలాది మంది ప్రపంచ పర్యాటకులు వస్తుంటారు.

సింగిల్ పేజీ కథ

# చైనా చదువు

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

అదో చిన్న పట్టణం. బ్యాంకులోని ఉద్యోగస్తులంతా కలిసి వరుసగా ఇండ్లు కట్టుకుని దానికి 'బ్యాంకు కాలనీ' అని నామకరణం చేశారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ భువనచంద్ర భార్య భరణిది ఆ రోజు పుట్టినరోజు. కాలనీ వాసుల వాట్సప్ గ్రూపులో అందరూ ఎగబడి శుభాకాంక్షలు తెలిపారు. ఖుషీ అయ్యింది భరణి.



కూరగాయలు అమ్మే అబ్బాయి వచ్చాడని బ్యాగు తీసుకుని ఇంటి నుంచి బయటికి వచ్చింది. పట్టుచీర కట్టుకుని బంగారు నగలు వేసుకుని మెరుపు ముఖంతో ఉంది. కావాల్సిన కూరగాయలు కొంటుంటే ఎదురింటి వెంకటేశు భార్య వెన్నెల అక్కడికి వచ్చింది. పలకరింపుగా చిన్న నవ్వు నవ్వి కొత్తిమీర, కరివేపాకు కొంటూ ఉంది.

భరణికి చిరుకోపం వచ్చింది. ఎందుకంటే 'ఫేస్‌బుక్‌లో అందరికన్నా ఎక్కువ పూలు విసురుతూ శుభాకాంక్షలు తెలిపింది. ఎదురుగా కనిపిస్తే గ్రీట్ చేయలేదేమిటా?" అని దిగులు పడింది.

“పనుల్లో పడి బర్త్‌డే విషయం మరిచిపోయిందేమో” అనుకుని సర్దుకుంది. మనమైనా పలకరించకపోతే బాగుండదనుకున్న భరణి తెచ్చిపెట్టుకున్న నవ్వుముఖంతో “మీ అబ్బాయి టెన్త్ కదా.. పై చదువులకి ఏ కాలేజీలో చేరుద్దామని అనుకుంటున్నారు?” అని అడిగింది.

కొనుక్కున్న కొత్తిమీర, కరివేపాకులను బ్యాగులో వేసుకున్న వెన్నెల “అన్ని విషయాలు తెలుసుకుని చైనాలో ఏదో ఒకటి, మంచి కోర్సులో చేరుద్దామని అనుకుంటున్నాం” అని చెప్పి వెళ్లిపోయింది.

భరణికి కడుపు మంట, కడుపులో మంట రెండూ మొదలయ్యాయి. మొక్కుబడిగా కూరగాయలు కొనుక్కుని సరసరా ఇంట్లోకి వచ్చింది.

న్యూస్ పేపర్ చదువుతున్న మొగుడితో “వెన్నెల మొగుడు వెంకటేశు చేసేది మీ కన్నా చిన్న ఉద్యోగమా? పెద్ద ఉద్యోగమా?” అని గట్టిగా అడిగింది.

“నీకు అనుమానం ఎందుకు వచ్చింది? నేను ఆఫీసర్‌ని. అతనేమో క్లర్కు” అని సమాధానమిచ్చాడు.

“మరి... జీతం మీకు ఎక్కువా? ఆయనకి ఎక్కువా?” అని నిలదీసింది.

“చిన్న ఉద్యోగులకి చిన్న జీతం, పెద్ద ఉద్యోగులకు పెద్ద జీతం మామూలే కదా. అయినా ఓపెన్ యూనివర్సిటీలో ఎం.ఏ. చదివినదానివి. ఇంత చిన్న లాజిక్ ఎలా మరిచావు? అయినా నీకు ఇప్పుడా అనుమానం ఎందుకు వచ్చింది.” అని ఎదురు ప్రశ్న వేశాడు.

“ఏమీ లేదు. మనం పిల్లల ఫీజులు కట్టడానికి ప్రతిసారీ డబ్బుల కోసం పర్సులన్నీ వెదుక్కుంటూ ఉంటాం. అలాంటిది.. వాళ్లు తమ కొడుకుని చైనా కాలేజీలో చేర్పించబోతున్నారట” అని రాగాలు తీస్తూ చెప్పింది.

కుర్చీలో కూర్చుని ఉన్న భువనచంద్రకి కుర్చీ కింద కట్టెల పొయ్యి పెట్టినట్లనిపించింది. కసిగా లేచాడు. అక్కడే ఉంటే బ్లడ్‌ప్రెజర్ పెరిగి రక్తనాళాలు ఢాం అని పేలిపోతాయేమో అనిపించింది.

“నాది అసమర్థుని జీవయాత్ర” అని తనని తానే తిట్టుకుంటూ ఒత్తిడి తగ్గించుకోవడానికి వాకింగ్‌కని బయలుదేరాడు. నడకదారిలో మేనేజర్ కూడా తోడయ్యాడు. హై-వోల్టేజి బల్బులా వెలిగే భువనచంద్ర ముఖంలో లో-వోల్టేజీ బల్బులా వెలుగుతుండటం చూసి కారణమేమిటని ప్రశ్నించాడు.

విషయం వివరంగా చెప్పాడు భువనచంద్ర. అంతా విన్న మేనేజర్ మనసు లోలోపలే 'క్యార్ క్యార్' అని గగ్గోలు పెట్టింది 'కూలోడికి కూడా మగబిడ్డా?” అన్నట్లుగా కుతకుతలాడిపోయాడు.

“చేసిన వాకింగ్ చాల్లే.. ఇంటికి పోదాం!” విసుగ్గా అన్నాడు మేనేజర్.

ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. దారిలో మేనేజర్ “ఈ మధ్యన వెంకటేశు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లున్నాడు. ఆలస్యంగా ఆఫీసుకు రావడం, బాగా రాత్రి అయ్యాక ఇంటికి చేరడం గమనిస్తూ ఉన్నాను. బాగా వేనుకున్నట్లున్నాడు” అని అంటుండగా భువనచంద్ర ఇల్లు వచ్చింది.

ఒకరికొకరు 'బాయ్.. బాయ్' చెప్పుకుంటుంటే సర్రున స్కూటర్‌లో వస్తూ వెంకటేశు కనిపించాడు.

మేనేజర్‌ను చూసి మర్యాదపూర్వకంగా బండి ఆపాడు.

“ఏమయ్యా వెంకటేశు. బాగా బిజీ ఉన్నట్లు ఉన్నావే!” అని అడిగాడు.

“మీకు తెలియకుండా ఏమి బిజీ సార్?” అని బదులిచ్చాడు.

విషయాన్ని కడుపులోనే పెట్టుకుంటే పొట్ట ఫట్‌మని పేలిపోతుందేమోనని మేనేజర్ “మీ అబ్బాయిని చైనాలో చేరిపిస్తున్నావట కదా!” అని ఆసక్తిగా అడిగాడు.

ఏమి సమాధానం వస్తుందోనని వెంకటేశు ముఖంలోకి చూశాడు భువనచంద్ర.

జవాబు కోసం ఏమాత్రం తడుముకోకుండా వెంకటేశు “తప్పదు కదా సార్. ఈ ఊళ్లో ఇంటర్‌లో చేరాలంటే రెండే కాలేజీలు ఉన్నాయి. ఒకటి చైతన్య, మరొకటి నారాయణ. అందుకని వాటిలో ఏదో ఒక కాలేజీలో చేర్చాలని అనుకుంటున్నాను” అన్నాడు.

వెంకటేశు సమాధానంతో అప్పటివరకూ భగభగమని మండిపోతూ ఉన్న వారిద్దరి కడుపులూ ఒక్కసారిగా చల్లబడ్డాయి.

“మంచిది....మంచిది...” అని పైకి అంటూనే “చైనా అంటే చైతన్య, నారాయణ కాలేజీలని అర్థమా!” అని ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

మిద్దె పైనుంచి వారి మాటలు అన్నీ విన్నది భరణి. కడుపుమంట తగ్గడానికి తన చేతిలో పెట్టుకుని ఉన్న జెలిసిల్ మాత్రని పక్కన పడేసింది. ✦

# ..వాయిదా పడుతోంది

## వాస్తువార్త


వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458




కె.సుబ్రహ్మణ్యం - ఖమ్మం

ప్రశ్న: నూట పదహారు చ.గ. స్థలంలో మేం రెండు తాటాకుల ఇండ్లు కట్టుకున్నాం. ఈ ఇండ్లు దక్షిణంగా వున్నాయి. గత రెండు సంవత్సరాలుగా పెంకుటిల్లు కట్టుకుందామని ప్రయత్నిస్తున్నాం. ఎంత ప్రయత్నించినా పెంకుటిల్లు కట్టుకోవడం జరగటం లేదు.

జవాబు: మీరు వున్న స్థలంలో దక్షిణ భాగంలో రెండు తాటాకు ఇండ్లు కట్టుకున్నామని రాశారు. ఆ తాటాకు ఇండ్ల వల్ల మీ స్థలంలోని వాయవ్య మూల పూర్తిగా కప్పుకుపోయి ఉంటుంది. అలాగే నైరుతి మూల తెరిచి వుండే అవకాశం కూడా వుంది. ఈ రెండింటిలో ఏ ఒక్కటి జరిగినా సాధారణంగా ఇంటి నిర్మాణంలో, ఆ ఇంట్లో నివసించేవాళ్ల జీవితాల్లో అభివృద్ధి కుంటుపడుతూ ఉంటుంది. ఒకవేళ వాయవ్య మూల మూతపడి వుంటే దాన్ని కనీసం మూడు అడుగుల మేరకు తెరిపి చేయండి. నైరుతి మూల తెరిపి వుంటే అక్కడ వేసిన తాటాకు ఇంటికి తగులకుండా ఆ నైరుతి మూలన ఏదైనా చిన్న షెడ్డులాంటిది వేసి పైన కప్పు వేయండి. కప్పు వేయటానికి షీట్లుగానీ, తాటాకులుగానీ వాడవచ్చు.

## దోషాలున్నాయా?

ఇ.నారాయణి - చిన్న చింతకుంట

ప్రశ్న: ఈ మధ్యలో మా ఇంటికి కొన్ని మార్పులు చేసాం. అయినా సమస్యలు తీరలేదు. మేం ఎవరి జోలికి పోకుండా ఒకచోట కూర్చున్నా బయటివాళ్ల మమ్మల్ని గొడవలోకి లాగుతున్నారు. ఎంత డబ్బున్నా ఖర్చయిపోతోంది. ఏ పని చేద్దామన్నా ధైర్యం సరిపోవటం లేదు. మా నాన్న, మా పెద్దనాన్న ఎప్పుడూ బయటివాళ్ల గురించి గొడవ పడుతున్నారు. అన్నదమ్ములం అటు వ్యాపారం లేక ఇటు చదువులు లేకుండా అయ్యాం. మా ఇంటి ప్లాను పంపిస్తున్నాం. దోషాలేమైనా తెలుపగలరు.

జవాబు: మీ ఇంటికి తూర్పు ఈశాన్య మూల చాలా ఎక్కువ పెరగటం వలన స్థల స్వరూపం విసనకర్ర ఆకారంలో వుంది. ఆ ఈశాన్యాన్ని తగ్గిస్తూ ఇప్పుడు తలుపు పెట్టారు. అది మంచిదే కానీ ఆ తలుపుకి ఎదురుగా ఇంటి లోపలి స్థలంలో బావి వుంది. అది మంచిది కాదు. అందుకే ఈశాన్యాన్ని తగ్గిస్తూ పెట్టిన తలుపు తీసివేసి అక్కడ గోడని పూర్తిగా కట్టండి. ఇంటి పైకప్పులో ఈశాన్య లోపం వుంది. కిచెన్ పైనుండి వచ్చే కప్పు (తూర్పు వైపున) వెనక్కి తిరిగి ఈశాన్యాన్ని తగ్గిస్తోంది.

అలా పై కప్పు నేరుగా ఈశాన్యం వైపుకు తీసుకువెళ్లి ఆ 'ఎల్' ఆకారాన్ని పూరిస్తూ ఇంటి పైకప్పుకి పూర్తి దీర్ఘ చతురస్రాకారాన్ని కూర్చండి. ఈ రెండు మార్పుల వల్ల మీకు చాలా మంచి ఫలితాలు వస్తాయి.

## వివాహం కావడం లేదు..?

ఎమ్.కామాక్షి - మాల్

ప్రశ్న: మా గృహం పిత్రార్జితం. సుమారు డెబ్బై సంవత్సరాల క్రితం నిర్మించిన ఇల్లిది. అన్నదమ్ములు వారి వాటాలు అమ్మటం వల్ల ఇల్లు మొత్తం నా స్వాధీనంలో వుంది. ఏడు సంవత్సరాల నుండి మేం అందులో ఉంటున్నాం. ఈ ఏడు సంవత్సరాల నుండి మాకు కష్టాలే కానీ మంచి జరగటం లేదు. పూర్వమున్న స్నేహితులు కూడా శత్రువులుగా మారారు. ఆడపిల్లలకు వివాహం చేయలేక పోతున్నాం. ఈ ఇంటికి మారిన తరువాత ఆడపిల్ల వివాహం జరిగింది. కానీ వివాహం జరిగిన ఆరు నెలలకే కలతలు వచ్చి ప్రస్తుతం మాతోనే వుంది. మిగిలిన వారికి ఇంతవరకు వివాహం కాలేదు. మా పరిస్థితికి ముఖ్య కారణాలేంటి?

జవాబు: మీరు కొత్తగా కొన్న స్థలం వలన ఇంటి స్వరూపం పరిపూర్ణమయిందే తప్ప దానివలన దోషం లేదు. మీ ఇంటికి తూర్పు ఈశాన్యం చక్కగా పెరిగి వుంది. కానీ దాన్ని మీరు సరైన విధంగా ఉపయోగించలేదు. ఆ కారణంగా మీకు ఇటువంటి పరిస్థితి ఏర్పడింది.

ఇంటి చుట్టూ వున్న నైసర్గిక పరిస్థితులు కూడా అందుకు కొంతవరకు కారణమని చెప్పవచ్చు. నుయ్యి పక్కన తూర్పు ఈశాన్యంలో పెట్టిన గేటుకెదురుగా లెట్రిన్స్, బాత్‌రూములు వుండకూడదు. వాటిని పూర్తిగా తీసివేయాల్సి ఉంటుంది. గేటు పారుననుసరించి ఎదురుగా కాకుండా కొత్తగా కొన్న స్థలం కూడా కలిసిపోయింది. కాబట్టి ఆ స్థలానికి పశ్చిమ గోడనానుకొని (గేటుకెదురుగా కాకుండా) లెట్రిన్స్, బాత్‌రూమ్స్ కట్టుకోవాలి.

తూర్పు ముఖ ద్వారమయిన ఇల్లు అయినప్పటికీ మీరు తూర్పునకు (వీధిలోకి) ఒక్క ద్వారం కూడా పెట్టలేదు. తూర్పుగోడకు ఆనించి వున్న మూడు గదులు తీసివేసి తర్వాత ఈశాన్యం వైపు వచ్చే గదికి తూర్పు ఈశాన్యంలో తలుపు పెట్టి దానికెదురుగా మరో గేటు తెరవాలి. లేదా ఇప్పుడున్న ఈశాన్య గదిని కిచెన్(మెస్) గా వాడకుండా వంటపని ఆగ్నేయ గదిలో ఆగ్నేయ మూలకి మార్చి చూడండి. మంచి ఫలితాలు కనిపిస్తాయి.

అలా అయినా ప్రస్తుత కిచెన్‌గా ఉపయోగి స్తున్న ఈశాన్య గదికి తూర్పు ఈశాన్యంలో తలుపు పెట్టి మిగతా లోపలి తలుపులు దానికెదురుగా వచ్చేటట్లు అమర్చాలి. ఇలా చేయటం వల్ల మీ సమస్యలు దూరమవుతాయి.



# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా చేపట్టిన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం అత్యవసరం. డ్రైవింగ్ విషయంలో నిర్లక్ష్యం తగదు. సోదరుల నుంచి ధన లాభం పొందుతారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. మీకు ఇష్టమైన కోర్సులో సీటు లభిస్తుంది.

## వృషభం



కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయట పడతారు. వివాదాలకు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభిస్తాయి. కాంట్రాక్టులు లభిస్తాయి. శుభవార్త వింటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కొత్త విద్యల కోసం రుణాలు తీసుకుంటారు. లలిత కళల పట్ల ఆసక్తి చూపుతారు.

## మిథునం



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరుల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. రాజకీయాల్లో ప్రవేశించాలని ఆలోచిస్తారు. సమావేశాలు కలిసి వస్తాయి.

## కర్కాటకం



కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాల్లో అభివృద్ధి సారిస్తారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఏ పని చేపట్టినా పట్టుదలతో పూర్తి చేస్తారు.

## సింహం



రుణ వత్తిడుల నుంచి బయట పడతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. దూర ప్రాంతాల వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి. శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి. పోటీ పరీక్షల్లో మీ ప్రతిభను నిరూపించుకుంటారు.

## కన్య



వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. అనుకోని ప్రయాణాలు లాభిస్తాయి. క్రయ-విక్రయాల్లో లాభాలు పొందుతారు. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఇంటి నిర్మాణ వస్తువుల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలం.

## తుల



ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయడం మంచిది. సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపుతారు.

## వృశ్చికం



కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి చూపుతారు. రాజకీయాల్లో ప్రవేశించాలన్న ఆసక్తి ఏర్పడుతుంది. ఒక వర్గానికి మీ మద్దతు తెలియపరుస్తారు. విదేశీ ప్రయాణాలు అనుకూలం. కొత్త ప్రయోగాలు విజయవంతం అవుతాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణితో ధూపం వేయండి.

## ధనుస్సు



విందు-వినోదాలు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. మీ చేతుల మీదుగా కొన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహంగా ఉంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. రాజకీయాల్లో సభ్యత్వం తీసుకుంటారు.

## మకరం



రుణాలు తీరుస్తారు. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. పనుల్లో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. వాహనాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. సంఘంలో గౌరవం పొందుతారు. ఆహ్వానాలు అందుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. విద్యార్థులక పరీక్షల వత్తిడి ఉంటుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి.

## కుంభం



నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులు పరిచయమై మిత్రులుగా మారతారు. బంధువులతో ఆనందంగా గడుపుతారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటి నిర్మాణ వస్తువుల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. విద్యార్థులకు పరీక్షల వత్తిడి ఉంటుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.


## మీనం



కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వాహన సౌఖ్యం పొందుతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం శుభప్రదం. విద్యార్థులు మెడికల్ విద్య అభ్యసించాలని కోరుకుంటారు. పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

# ఈ వారం కా‘ర్యాటూన్స్’


నీకు నెక్లెస్ కొనిద్దామనుకే అనుకున్నారట..
ఇంతలోనే ఆ మాయదారి ఎలక్షన్ కోడ్ వచ్చేసిందట!
Zakir...


‘హోళీ’ మాత్రం పండగ కాదా.?
చందాలు వసూలు చేయద్దా? పదా!!
Zakir...


ఏవిటీ? శాపవశాత్తూ దోమ జన్మెత్తిన
గంధర్వ కన్యల్ని శాప విముక్తి కల్గిస్తున్నావా?!!
Zakir...



ఒక్కో దేవాలయం ఒక్కో ప్రత్యేకత కలిగి ఉంటుంది. **ఓం** ఆకారంలో ఉండడం ఈ శివాలయం ప్రత్యేకత.
రాజస్థాన్ పాలీ జిల్లాలోని జోదన్ అనే గ్రామంలో ఉందీ గుడి. ఈ ఆలయంలో వందకు పైగా ఆలయాలు, జ్యోతిర్లింగాలు, అనేక దేవతామూర్తులు దర్శనమిస్తాయి.











